# ఏపీలో రెండ్రోజుల పాటు వర్షాలు

**విశాఖపట్నం, జూన్ 11, మేజర్ న్యూస్:** ఏపీలోని పలు ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఆ మేరకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. బుధవారం నాడు అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మిగతా 2లో





నేటి దినపత్రిక
సూర్య
ఉత్తరాంధ్ర
బుధవారం 12-6-2024 పేజీలు 6
www.suryaa.com
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం శ్రీకాకుళం

# బాబు మంత్రి వర్గంలో బెర్తు దక్కేనా!

## -ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో ఆశావహులు -ఉమ్మడి విశాఖ నుంచి చాంతాడంత క్యూ -శ్రీకాకుళం, విజయనగరం నుంచీ తగ్గేదేలే అంటున్న సీనియర్లు











**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో టీడీపీ ఓ ఊపు ఊపేసింది. పాడేరు, అరకు మినహా పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. రికార్డు స్థాయి మెజార్టీలతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు అదే ఊపు...ఉత్సాహంతో బాబు మంత్రి వర్గంలో బెర్తు కోసం పోటీ నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. ఒక్కో జిల్లా నుంచి చాంతాడులా మంత్రి వర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్నారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా అంతా మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఒకప్పుడు జిల్లా నుంచి ఫలానా వ్యక్తికి ఇవ్వండి అనే వారు. కానీ ఈ సారి గెలిచిన ఎమ్మెల్యేల సంఖ్య భారీగా ఉండడం..మూడు పార్టీల ముఖ్యులను సమన్వయం చేసుకుంటూ పదవులను కేటాయించడం కత్తి మీద సామే....అయినా సీఎంగా 14 ఏళ్ల సుదీర్ఘ అనుభవం వున్న చంద్రబాబు ఇవేమీ పెద్ద పట్టింపు కాకపోవడంతో ఆయన కూల్‌గానే ఉన్నారు. కానీ ఆశావహులు మాత్రం నిరంతరం మంత్రి వర్గంలో స్థానం కోసం శ్రమిస్తూనే ఉన్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు అందరా మంత్రి వర్గంలో చోటు కోసం పోటీలోనే ఉండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



**అచ్చెన్నకు ఖాయమేనా...!**

ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 36 మంది ఎమ్మెల్యేల్లో 34 మంది కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. ఇంత భారీ సంఖ్యలో గతంలో ఎన్నడూ గెలవలేదు. ఒకే పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు విజేతలు కావడంతో ఇప్పుడు వారంతా మంత్రి వర్గంలో చోటు కోసం ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. కొందరు కొత్త అభ్యర్థులు అయితే మరికొందరు రెండు మూడు సార్లు మంత్రి వర్గంలో పని చేసిన వారూ ఉన్నారు. ఇప్పుడు వారంతా మంత్రి వర్గంలో చోటు కోసం పరితపిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి కింజరాపు అచ్చెన్నాయుడుకు మంత్రి వర్గంలో చోటు ఖాయంగా చెప్పుకుంటున్నారు. టీడీపీకి రాష్ట్ర అధ్యక్షునిగా ఉండడంతో పాటు ఆ జిల్లాలో బలమైన సామాజిక వర్గం నేతగా పేర్గాంచారు. ఆయన కుటుంబం మొదటి నుంచీ టీడీపీకి అండగా ఉండడం...టీడీపీ కూడా ఆ కుటుంబానికి గౌరవం ఇవ్వడం జరుగుతోంది. అందుకే ఆయన్ని కాదని ఇతరులకు మంత్రి వర్గంలో చోటు ఊహించుకోవడం కష్టమేనని అంటున్నారు. ఇప్పటికే ఆ జిల్లా నుంచి ఎంపీ కె. రామ్మోహన నాయుడుకి కేంద్ర మంత్రి వర్గంలో పౌర విమాన యాన శాఖ మంత్రి అయ్యారు. అయినా అదే కుటుంబం నుంచి అచ్చెన్నాయుడుకు కూడా రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు ఖాయంగానే చెప్పుకుంటున్నారు. అదే జిల్లా నుంచి ఎస్సీ సామాజిక వర్గం నుంచి కొండ్రు మురళీ కూడా చోటు ఆశిస్తున్నారు. ఈయన కాంగ్రెస్ పార్టీలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా వ్యవహరించారు. ఇప్పుడు మంత్రి వర్గంలో చోటు కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు.







**బొబ్బిలి రాజా....బాబు వర్గంలో చేరేనా...!**

విజయనగరం జిల్లాకు సంబంధించి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పేరు బాబు మంత్రి వర్గంలో ఖాయంగా ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. బొబ్బిలి రాజుల పేరు లేకుండా బాబు మంత్రి వర్గం ఉండదని స్థానికంగా చెప్పుకుంటున్నారు. అందుకే ఈ సారి బేబీ నాయన పేరు మంత్రి వర్గంలో గట్టిగా వినిపించవచ్చని ఆ జిల్లా వాసులు భావిస్తున్నారు. అలాగే విజయనగరం అర్బన్‌కు సంబంధించి అదితి గజపతి పేరు కూడా బాగానే వినిపిస్తోంది. ఈమె మొదటి సారి అసెంబ్లీకి గెలిచారు. అయితే మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు తనయ కావడంతో ఈమెకు ప్రాధాన్యతన ఉంటుందన్నది ఆ జిల్లా వాసుల వాదన. అదితి పేరు లేకుండా మంత్రి వర్గం ఉండదన్నదే ఆ ప్రాంత వాసుల నమ్మకం.ఇదే జిల్లా నుంచి బొత్స సత్యన్నారాయణ కోటను నామరూపాల్లేకుండా చేసిన మాజీ మంత్రి కళా వెంకట్రావు పేరు కూడా మంత్రి వర్గ జాబితాలో ఉన్నట్టుగా వినిపిస్తోంది. అయితే ఎవరి పేరు ఉంటుందో ...చంద్రబాబు మదిలో ఏముందో అన్నది ఎవరూ ఊహించలేకపోతున్నారు.

**ఉమ్మడి విశాఖలో పోటా పోటీ...!**

ఉమ్మడి విశాఖ మూడు ముక్కలుగా విడిపోయింది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖగా వేరు అయినప్పటికీ పోటీ మాత్రం విశాఖ నుంచే భారీగా ఉంది. ఈ జిల్లా నుంచి మహా మహులంతా గెలిచి తీరడంతో ఇప్పుడు మంత్రి పదవుల పంపకం పెద్ద కుంపటిగా తయారైంది. ఎవరికి వారే తనకే మంత్రి పదవి దక్కుతుందని తన అనుయాయుల వద్ద చెప్పుకుంటున్నారు. దీంతో చాంతాడులా మంత్రి వర్గంలో చోటు ఆశించే వారి సంఖ్య పెరిగిపోయింది. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థులు భారీ సంఖ్యలో గెలిచి ఉన్నారు. పార్టీలు...సామాజిక వర్గాలు...వివిధ కోటాలు అన్నీ పరిగణనలోకి తీసుకున్నా విశాఖ నుంచి మంత్రి వర్గంలో చోటు ఆశించే అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నర్సీపట్నం నుంచి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు...భీమిలి నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు...పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరిలో ఏ ఒక్కరి పేరు లేకపోయినా మరొకరితో తంటా ఉండొచ్చనే అనుమానాలు సైతం లేకపోలేదు. మరో పక్క అనకాపల్లి నుంచి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేరు గట్టిగా వినిపిస్తోంది. జనసేన నుంచి ఆ పార్టీ కోటాలో...గవర సామాజిక వర్గం కోటాలో ఆయనకు తప్పక మంత్రి వర్గంలో చోటు ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. మరో పక్క రాష్ట్రంలోనే భారీ మెజార్టీతో విజయం సాధించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ పేరు కూడా అదే స్పీడులో ఉంది. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ దక్కని మెజార్టీ పల్లాకు దక్కడంతో ఆయనకు యాదవ కోటాలో మంత్రి వర్గంలో చోటు ఉంటుందన్న ప్రచారం కూడా మిగతా 2లో

# సీఎం ప్రమాణానికి తరలి వెళ్లిన క్యాడర్

## - నాలుగో సారి సీఎంగా చంద్రబాబు -హాజరవుతున్న మహామహులు -దారులన్నీ విజయవాడ వైపే..

**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** టీడీపీ విజయం తో మంచి ఊపు మీదున్న ఆ పార్టీ శ్రేణులు మంగళవారం అమరావతికి బయల్దేరారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉత్తరాంధ్ర నుంచి భారీగా నేతలు తరలి వెళ్లారు. మంగళవారం ఉదయం నుంచీ విశాఖ నుంచి పలు ప్రత్యేక వాహనాలు అమరావతికి బయల్దేరాయి. నాలుగో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడును స్వయంగా కలసి శుభాకాంక్షలు చెప్పాలనే ఉత్సాహంతోనే ఉత్తరాంధ్ర టీడీపీ శ్రేణులు కదిలినట్టు చెబుతున్నారు. ఈ సారి టీడీపీకి పోటీగా జనసేన, బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో బయల్దేరారు. కేంద్రం నుంచి ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వంటి ప్రముఖులతో పాటు రాష్ట్ర అతిథిగా మెగాస్టార్ చిరంజీవి, సినిమా తారలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అమరావతిలో బుధవారం అట్టహాసంగా జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఉత్తరాంధ్ర వాసులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఉత్తరాంధ్ర నుంచి వేలాది వాహనాలు అమరావతి వైపు వస్తాయని ముందే ఊహించిన పోలీస్ అధికారులు అందుకు భద్రతా ఏర్పాట్లు చేసే క్రమంలో ట్రాఫిక్‌ను కత్తిపూడి నుంచి మళ్లించారు. దీంతో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా నేరుగా ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదిక వద్దకు వెళ్లే ఛాన్స్ ఉంటుందని భావిస్తున్నారు.

# దొంగ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

## -రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీకి వినతినిచ్చిన ఆదివాసీలు -బాధ్యులపై చర్యలు చేపట్టాలి: పీఎస్ అజయ్ కుమార్

**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** సాగులో ఉన్న భూముల్ని అధికారులు దొంగ లెక్కలు రాసి జిరాయితీ చేసేశారని, భూ మాఫియాతో కుమ్మక్కై రికార్డులు మార్చేశారని, అయినా అధికారులపై ఎలాంటి చర్యల్లేవని ఆదివాసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విశాఖలోని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కోనాం శివారు కొత్తవీధి కొందు పీవీటీజీ ఆదివాసీలు తామెదుర్కొన్న సమస్యల్ని డీఐజీ దృష్టికి తీసుకు వెళ్లారు. కోనాం గ్రామంలోని సర్వే నంబర్ 289/1ఏలో 8 ఎకరాల సీలింగ్ మిగులు భూముల్ని కలుపుకొని, 37ఎకరాలకు రిజిస్ట్రేషన్లు మిగతా 2లో



# 70 ఎకరాల మెగా ఫుడ్ పార్క్ భూములకు జవహర్ ఎసరు

## -పారిశ్రామిక వేత్త చేతుల్లో భూములుండగా,రైతులు వద్ద ఉన్నట్లు ఫ్రీ హెూల్డ్ సర్టిఫికెట్లు జారీ -20 ఎకరాల ప్రభుత్వ భూమికి పత్రాలు : జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్



**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్రాలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వందల కోట్ల విలువైన భూ దందాలు చేశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం భోగాపురం మండలం బసవపాలెంలో మెగా ఫుడ్ పార్క్‌కు కేటాయించిన 70ఎకరాల ఏపీఐఐసీ భూములకు జవహర్ రెడ్డి ఫ్రీహెూల్డ్ సర్టిఫికెట్లు జారీ చేయించి రిజిస్ట్రేషన్లకు సిద్ధం చేశారని సంచలనం రేకెత్తించారు. ఈ కుంభకోణం బయటపడడంతో సంబంధిత రిజిస్ట్రేషన్ అధికారులు అందుకు నిరాకరించడంతో రూ.200 కోట్ల విలువైన భూ స్కాం ఆగిందని స్పష్టం చేశారు. ఇందులో ఏపీఐఐసీ సేకరించిన 50ఎకరాల డీ పట్టా భూములతో పాటు మరో 20ఎకరాల ప్రభుత్వ భూములకు కూడా ప్రైవేట్ వ్యక్తులే యజమానులన్నట్లు నకిలీల పేరిట ఫ్రీహెూల్డ్ పట్టాల్ని జవహర్ రెడ్డి జారీ చేయించారని ఆధారాలు చూపించారు.

**2019లోనే కేటాయింపులు**

మెగా ఫుడ్ పార్క్‌కి బసవపాలెం సర్వే నంబర్-22, 23, 24, 79, 80, 81, 82, 83ల్లోని ఈ భూముల్ని ఫిబ్రవరి 13, 2019నే జీవో నంబర్ 139కింద కేటాయించారని మూర్తి యాదవ్ తెలిపారు. మూడేళ్లలో ఈ భూముల్లో ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయాలని అదేశించారని, అయితే ప్రభుత్వం మారడంతో, ప్రోత్సాహం లేకపోవడంతో ఆ ఫుడ్ పార్క్ ఏర్పాటు కాలేదని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు ఏర్పాటు చేయలేకపోతే ఆ భూమిని ప్రభుత్వానికి తిరిగిచ్చేయాలని, అయితే తమ ఇబ్బందుల్ని తెలియజేస్తూ భూమి కేటాయింపజేసుకొన్న సంస్థ హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకుందని గుర్తు చేశారు.

**రంగంలోకి జవహర్ ముఠా**

భోగాపురం విమానాశ్రయం కేంద్రంగా వందల ఎకరాల్ని అప్పటికే జీవో 596ను అడ్డం పెట్టుకొని, దళితుల నుంచి బలవంతంగా లాక్కొని, ఆ భూములపై జవహర్ రెడ్డి ముఠా కన్ను వీటిపై పడిరదన్నారు. అధికార దాహంతో పారిశ్రామిక వేత్త చేతుల్లో కాకుంటే ప్రభుత్వ విభాగమైన ఏపీఐఐసీ చేతుల్లో ఉండాల్సిన ఈ భూములు రైతుల చేతుల్లోనే ఉన్నట్టు జవహర్ రెడ్డి ముఠా చూపించిందని చెప్పారు. విజయనగరం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌పై జవహర్ రెడ్డి ఒత్తిడి తీసుకొచ్చి ప్రభుత్వమే స్వయంగా గతంలో కేటాయించిన భూముల్ని రైతుల చేతుల్లో ఉన్నట్టు ఫ్రో హెూల్డ్ సర్టిఫికేట్లు జారీ చేయించి, వారితో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సిద్ధమయ్యారన్నారు.

**20ఎకరాల ప్రభుత్వ భూమి హాంఫట్**

రైతుల నుంచి ఏపీఐఐసీ సేకరించిన 50 ఎకరాలతో పాటు పక్కనే ఉన్న మరో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఫుడ్ పార్క్ కు కేటాయించారని మూర్తి యాదవ్ తెలిపారు. విచిత్రంగా జవహర్ రెడ్డి ముఠా ఆ 20ఎకరాల్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్నట్టు తమ అధికార బలంతో తప్పుడు రికార్డులు సృష్టించి దానినీ తమ ఖాతాలో వేసుకొనేందుకు ఫ్రీహెూల్డ్ సర్టిఫికేట్లు జారీ చేయించారని ఆరోపించారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని, జవహర్ రెడ్డితో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులంతా ఇందులో అడ్డంగా బుక్ అవుతారన్నారు. వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**కొత్త ప్రభుత్వం విచారణ జరిపించాల్లి**

ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడాల్సిన మాజీ సీఎస్ జవహర్ రెడ్డే భూ భక్షకుడిగా మారి తన బినామీల పేరిట వేలాది ఎకరాల భూముల్ని రిజిస్ట్రేషన్ చేయించిన సంఘటనపై కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని మూర్తి యాదవ్ తెలిపారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, దళితులు, పేదల చేతుల్లోని భూముల్ని భూస్వాముల పరం మిగతా 2లో

# ఆశ్రమాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**అరకులోయ, జూన్ 11, మేజర్‌న్యూస్:** అరకులోయ మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాల బాలికల ఆశ్రమ,ఆశ్రమోన్నత పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థినీ,విద్యార్థుల నుంచి ఆయా ఆశ్రమ,ఆశ్రమోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అరకులోయ ప్రభుత్వ గిరిజన సంక్షేమ కేంద్రీకృత ఆశ్రమోన్నత బాలుర పాఠశాల, స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, గన్నెల, లోతేరు, బస్కీ గిరిజన సంక్షేమ శాఖ బాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించాలని భావించే గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ, ఆశ్రమోన్నత బాల బాలికల పాఠశాలల్లో మూడవ తరగతి నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు పెట్టుకోవచ్చని ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలల్లో చేరి చదువుకోవాలని ఆసక్తి చూపే విద్యార్థినీ, విద్యార్థులు పూర్తి వివరాల కోసం పాఠశాల కార్యాలయాలను సంప్రదించవచ్చన్నారు. ఈనెల 13వ తేదీ గురువారం నుంచి బడులు తెరుచుకుంటున్న నేపథ్యంలో ఆలస్యం చేయకుండా తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో తక్షణమే పాఠశాలలకు దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తరువాత తాము ఆశించిన పాఠశాలల్లో తమ పిల్లలకు సీటు దొరకలేదని తల్లిదండ్రులు బాధపడితే ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

## చోద్యంలో తాటాకు ఇల్లు దగ్ధం



**గొలుగొండ, జూన్ 11, మేజర్‌న్యూస్:** గొలుగొండ మండలం చోద్యం జంక్షన్లో సోమవారం తెల్లవారుజామున బొత్సా రాంబాబుకు చెందిన తాటాకు ఇల్లు అగ్నికి ఆహుతి అయింది. ఈ ప్రమాదంలో సీట్లు తయారు చేసే సామాగ్రి పంపిణీకి సిద్ధంగా ఉన్న స్వీట్లు పంటల్లో కాలి బూడిదయ్యాయి. అదే విధంగా కాలిపోవడంతో మంటలను అదుపు చేయలేకపోవడంతో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారుగా మూడు లక్షల రూపాయలు విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. అయితే అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై మండల రెవెన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

## పాసులు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి

**: పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ**



**పలాస/మందస, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రివర్యులుగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయబోతున్న నేపథ్యంలో విజయవాడ నుండి, ఇతర ప్రదేశాల నుండి గన్నవరం ఫంక్షన్ ప్లేస్ కు పాసులు ఉన్న బస్సులు/కార్లను మాత్రమే అనుమతించడం జరుగుతుందని పోలిస్ కమిషనర్ రామకృష్ణ మంగళవారం తెలిపారు. పాసులు లేని ఇతర వాహనాలు అనుమతించబడదు. విజయవాడలో 1.ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, 2.అంబేద్కర్ విగ్రహం వద్ద, 3.బస్ స్టాండ్, 4.రైల్వే స్టేషన్, 5.లెనిన్ సెంటర్, 6.పటమట లోని జెడ్.పి.బాయ్స్ హై స్కూల్, 7.అజిత్ సింగ్ నగర్ లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, 8.జింకానా గ్రౌండ్స్ మరియు 9.విద్యధరపురం మినీ స్టేడియం ఈ 09 ప్రాంతాల నుండి సి.ఎం. గారి ప్రమాణ స్వీకర కార్యక్రామాన్ని ఎల్.ఈ.డి.స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల వారు ఆయా ప్రదేశాలకు వెళ్లి కార్యక్రమాన్ని వీక్షించవచ్చని తెలియజేశారు. ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వి.వి.ఐ.పి.లు, వి.ఐ.పి.లు మరియు ప్రముఖులు ఈ రహదారుల గుండా ప్రయాణం చేస్తారు కావున వారికి ట్రాఫిక్ పరంగా మరియు భద్రతా పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన బందోబస్త్ ఏర్పాట్లు చేసామని, ప్రశాంత వాతావరణంలో పాసులు కలిగిన ఆహ్వానితులు సభా స్థలానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేసామని తెలిపారు.

**విజయవాడ నగరము లోని సాధారణ వాహనములు మళ్ళింపులు:**

విజయవాడ నుండి ఏలూరు మరియు విశాఖపట్నం వైపుకు వెళ్ళు కార్లు, ద్విచక్ర వాహనములు, ఆర్.టి.సి. బస్సులు ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు బెంజ్ సర్కిలు నుండి కంకిపాడు-పామర్రు-హనుమాన్ జంక్షన్-ఏలూరు వైపుకు పంపబడును. ఓల్డ్ జంక్షన్ ఏలూరు రోడ్ హొటల్ స్వర్ణ పాలెస్ రామవరప్పాడు రింగ్?ఇన్నర్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డు హనుమాన్ జంక్షన్ ఏలూరు వైపుకు వెళ్ళ వలెను. గొల్లపూడి ఔటర్ రింగ్ రోడ్డు గన్నవరం ? హనుమాన్ జంక్షన్ వైపుకు వెళ్ళ వలెను.

### ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల
## భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**పాతపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఆదర్శ పాఠశాల, పాతపట్నంలో 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్లను రిజర్వేషన్ ప్రకారంగా భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏ.పీ మోడల్ స్కూల్ పాతపట్నం ప్రిన్సిపల్ కె.వి రత్న కుమారి గారు తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల ఆఫీసు నందు సంప్రదించాలని తెలుపుతూ ఈ నెల 12వ తారీకు లోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను మాత్రమే ఎంపిక చేస్తామని తెలుపుతూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఎం ఇ సి లో ఎంపికైన విద్యార్థులు తగు ధ్రువ పత్రాలతో అడ్మిషన్ పొందాలని సూచించారు. సకాలంలో అడ్మిషన్ పొందని సీట్లను తదుపరి విద్యార్థులకు కేటాయించబడును అని తెలియచేసారు.

## బాలుడు అనుమాన స్పద మృతి



**నెల్లిమర్ల, జూన్ 11, మేజర్‌న్యూస్:** నగర పంచాయితీ పరిధి కొండ పేటలో బాలుడు అనుమాన స్పదంగా మృతి చెందాడు. మంగళ వారం స్థానికులు అందించిన వివరాల ప్రకారం నగర పంచాయితీ పరిధి కొండ పేటకు చెందిన కారెపు చైతన్య (15) అనే బాలుడు గ్రామ శివారు కొండ పేట-కొత్త పేట రహదారి కొండ వద్ద గాయాలతో అనుమాన స్పదంగా మృతి చెందారు. కాగా గత రెండు రోజులుగా కనిపించక పోవడంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఇంతలో బాలుడు అనుమానస్పద స్థితిలో బాలుడు విగత జీవిగా కనిపించారు. మృతి పై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలిసులు సంఘటనా స్థలానికి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**ఆనందపురం, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం గొట్టిపల్లి జడ్పీ హైస్కూల్లో 2005-06 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మంగళవారం గుడిలోవ రిసార్ట్లో కలుసుకొని పూర్వజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు 19 సంవత్సరాల తరువాత సుమారు 30 మంది వివిధ వృత్తుల్లో స్థిరపడి అందరూ ఒకచోట కలిసికొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు కొంతమంది పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరూ వారి జీవితంలో జరిగిన సంఘటనలను మిత్రులతో కష్టసుఖాలను పంచుకొని భవిష్యత్తు కాలంలో ఒకరికి ఒకరు తోడు ఉంటామంటూ భరోసా కల్పించుకున్నారు. భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాలు సభ్యులందరూ కలిసి చేయడానికి నిర్ణయించుకున్నారు ఎవరికి ఏటువంటి కష్టాలు వచ్చినా తోడుంటామంటూ భరోసా కల్పించుకున్నారు ఈ సందర్భంగా సరదాగా క్రికెట్, డాన్స్, సిమ్మింగ్, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో దొంతల శ్రీరామ్, సవరవిల్లి అనిల్, కర్రోతు ధనలక్ష్మి, వెన్ని సురేష్, కంది జ్యోతి ఉపాధ్యాయులు రమేష్ కుమార్ , కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి
## తరలి వెళ్లిన పద్మనాభం నాయకులు



**పద్మనాభం, జూన్ 11, మేజర్‌న్యూస్:** అమరావతిలో ఈనెల 12 వతేదీన రాష్ట్ర నూతన సి.ఎం.గా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబునాయుడు బహిరంగ సభకు మంగళవారం పద్మనాభం మండల టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు రమణ, మాజీ అధ్యక్షులు నగేషకుమార్, పుప్పాల రమణ, మాజీ జెడ్పీటీసీ దామోదరరావు, నాయకులు గోపిబాబు, నందీష్, ఎర్రిబాబు, కృష్ణబాబు, పైడినాయుడు, గంగరాజు, అప్పలనాయుడు, సర్పంచ్ రమణ,మాజీ ఎంపీపీ లీలావతిలతో పాటు పలువురు కార్యకర్తలు అమరావతి తరలివెళ్లారు.

## అరకులోయ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్



**అరకులోయ, జూన్ 11, మేజర్‌న్యూస్:** అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది కలిసికట్టుగా ఉత్సాహంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. వేసవి సెలవుల్లో కళాశాల భవనాల చుట్టుపక్కల ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగిన కారణంగా వీటివల్ల ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని గుర్తించిన కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది వాటిని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.నాగబాబు, వై.విజయలక్ష్మి,మిస్యా. అనితకుమారి, ఐ క్యు ఎ సి సమన్వయకర్త డాక్టర్ పి. కొండబాబు, అధ్యాపకులు పి.సుందరీరాణి, ఎల్.ఎం.ఎస్. గణేష్, బి.లచ్చన్న, ఎస్.అప్పారావు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## గూడ్స్ రైలు డీ: గిరిజన మహిళ మృతి

**అరకులోయ, జూన్ 11, మేజర్‌న్యూస్:** అరకులోయ మండలంలోని బొండాం పంచాయతీ, నిన్నిమామిడివలస గ్రామానికి చెందిన వంతల. నోయిన అనే గిరిజన మహిళకు ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీ కోవడంతో మరణించింది. రైళ్ల పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు గిరిజన మహిళను ఢీ కొట్టింది. దీంతో ఆ గిరిజన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుందని, గూడ్స్ రైలు ఢీకొన్న సంఘటనలో గిరిజన మహిళ మృతి చెందిన సమాచారాన్ని మాత్రం రైల్వే పోలీసులకు మంగళవారం తెలియజేయవలసి వచ్చిందని నిన్నిమామిడి వలస గ్రామస్తులు విలేకరులకు తెలిపారు. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందచేయడంలో కొంత మేర జాప్యం జరిగిందన్నారు.

### వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన
## పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**పాతపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** పాతపట్నం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ అభ్యర్థి రెడ్డి శాంతి ,ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన వైఎస్ఆర్సీపీ అభ్యర్థులతో కలిసి వై.యస్ఆ.ర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని జగనన్న క్యాంపు కార్యాలయం నందు గౌరవప్రదంగా కలిసారు.

## ఏపీలో రెండు రోజుల పాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అలాగే పార్వతీపురంమన్యం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారంనాడు పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములతో కూడిన వర్షం పడేపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.

## పేట నుండి ప్రమాణ స్వీకార మహోత్సవానికి



**నరసన్నపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** నరస న్నపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యక ర్తలు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్య మంత్రి బుధవా రం ప్రమాణ స్వీకారం చేయ నున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి ప్రత్యక్షంగా పాల్గొనేందుకుతరలి వెళ్లారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల నుండి నాయకులు కార్యకర్తలు ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరవుతున్నారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పడే నూతన ప్రభుత్వం ప్రజలు ఆశలను ఆకాంక్షలను నిర్వర్తించేందుకుకృషి చేస్తుందని, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి శర వేగంగా ముందుకు దూసుకుపోతుందని ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన కార్యకర్తలు నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## బాబు మంత్రి వర్గంలో బెర్తు దక్కేనా.!

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. మరొ పక్క ఎస్సీ మహిళ కోటాలో పాయకరావు పేట నుంచి విజయం సాధించి అనిత పేరు కూడా ప్రచారంలో ఉంది. అయితే సీఎం చంద్రబాబు ఎవరికి అవకాశం కల్పిస్తారో అన్నది వేచి చూడాల్సి ఉంది.

## 70 ఎకరాల మెగా ఫుడ్ పార్క్ భూములకు జవహర్ ఎసరు

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు అవకాశం కల్పించిన 596జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల భూములు ఈ జీవో కింద చేతులు మారినందున, వాటిని అబయన్స్‌లో పెట్టి, ప్రత్యేక విచారణా బృందం (సిట్)తో విచారణ జరిపించాలని మూర్తి యాదవ్ కోరారు.

## దొంగ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, అప్పటి చిడికాడ తహసీల్దార్, మాడుగుల సబ్ రిజిస్ట్రార్ భూ మాఫియాతో చేతులు కలిపి, ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ ఆస్తిగా చూపించారని ఆరోపించారు. ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం, జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్ కుమార్ మాట్లాడుతూ, నిషేధపు ఉత్తర్వుల పుస్తకంలో ఉన్నప్పటికీ అధికారులు కుమ్మక్కై రూ.50లక్షల విలువైన భూముల వివరాల్ని ఐదు రిజిస్ట్రేషన్ల ద్వారా రికార్డుల్లో మార్చేశారని స్పష్టం చేశారు. సాగులో ఉన్న ఆదివాసీలు ఇదే విషయమై విజయవాడలోని రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదిచ్చారని గుర్తు చేశారు. అయితే ఆ శాఖ కమిషనర్ ఆదేశాలపై జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి విచారణ జరిపారని, అక్రమాలు బయట పడినప్పటికీ నేటికీ దస్తావేజులు రద్దు చేయడం గాని, అధికారులపై చర్యలు చేపట్టలేదన్నారు. జూల్కై 2023లోనే చర్యలు చేపట్టాలంటూ కమిషనర్ ఆదేశాలిచ్చినప్పటికీ 11నెలలు గడుస్తున్నా చర్యల్లేవన్నారు. చర్యల్లేకపోతే భూ మాఫియా సదరు భూముల్ని విక్రయించేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఆదివాసీల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇప్పటికైనా చర్యలు చేపట్టాలన్నారు. తీసుకోవాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివాసీల సాగుకు, వారి హక్కులకు రక్షణ కల్పించాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ఎమ్ సెట్‌లో 126 ర్యాంకు సాధించిన శరణ్య

**- నీట్ పరీక్ష లో 720 మార్కులకు గాను 700 సాధించగా ఆల్ ఇండియా లో 2,041, కేటగిరీలో 704 ర్యాంకు**



**బొబ్బిలి, జూన్ 11, మేజర్‌న్యూస్:** బొబ్బిలి పట్టణం సాయినగర్ కి చెందిన గోకుల్ శరణ్య కం బైపిసి లో ఎంపి ఎమ్ సెట్ లో 122 మార్కులకు గాను 126 ర్యాంకు సాధించింది. అలాగే నీట్ పరీక్ష లో 720 మార్కులకు గాను 700 సాధించగా ఆల్ ఇండియా లో 2,041, కేటగిరీలో 704 ర్యాంకు. శరణ్య బొబ్బిలి చైతన్య టెక్నో స్కూల్ లో పదవ తరగతి చదవగా, ఇంటర్ విశాఖ నారాయణ కళాశాలలో చదివింది. శరణ్య తండ్రి గోకుల్ వెంకటర మణ పూను బుచ్చిం పేట లో ఉపాధ్యాయుడు, తల్లి అరుణ గృహిణి. శరణ్య ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు తదితరులు అభినందనలు తెలియజేశారు.

# అబ్బురపరిచిన సాహితి జల యోగాసనాల ప్రదర్శన

### కోచ్ లేకుండానే స్వయం సాధన.. 32 ప్రపంచ అవార్డులు



**నర్సీపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** కోచ్ లేకుండానే స్వయం సాధన తో 22 గంటల పాటు నీటిపై తేలియాడే సామర్థ్యాన్ని సాధించి , 32 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్న కొత్తకోట కు చెందిన కలగర్ల సాహితి నర్సీపట్నంలో ప్రదర్శించిన నీటిలో యోగాసనాలు అబ్బురపరిచాయి. సోమవారం సాయంత్రం స్థానిక రాయల్ పార్క్ రిసార్ట్స్ స్విమ్మింగ్ పూల్ లో ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన "జలాశన" కార్యక్రమంలో సాహితి నీటిలో ప్రదర్శించిన వివిధ యోగాసనాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా సాహితీ మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించానని, తాను ఈ స్థాయికి రావడానికి తన తల్లిదండ్రులు ఎంతగానో శ్రమించారని తెలిపారు. 2019లో రేవు పోలవరంలో సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు చిన్నారులను కాపాడి కేంద్ర ప్రభుత్వం నుండి ఉత్తమ జీవన రక్షా పథక్ అవార్డు అందుకున్నానన్నారు. చిన్నవయసులోనే ఇటువంటి అవార్డులను సొంతం చేసుకోవడం అభినందించదగ్గ విషయమని ముఖ్య అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి రాయల్ పార్క్ రిసార్ట్స్ అధినేత గణపతిరాజు సూర్య బంగార్రాజు కుమార్తె గాయత్రి, సాహితీ తల్లిదండ్రులు నాగజ్యోతి, సర్వేశ్వరరావు, నింజాస్ అకాడమీ, ఆర్ పి మార్షల్ ఆర్ట్స్, అర్జున్ స్కేటింగ్ అసోసియేషన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జ్యోతి రాధిత్య సింధ్యాతో రామ్మోహన్ భేటీ

**-పూర్వ మంత్రి, అధికారులతో శాఖ నిర్వహణ అంశాలపై చర్చ -తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట**

**:పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



**శ్రీకాకుళం/నరసన్నపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా నియమితులైన కింజరాపు రామ్మోహన్ నాయుడు తన శాఖపై పట్టు సాధించే ప్రయత్నాన్ని మొదలుపెట్టారు. పౌర విమానయ శాఖ పై అవగాహన పెంచుకునేందుకు మంగళవారం న్యూఢిల్లీ లో ఇప్పటి వరకూ కేంద్ర విమానయాన శాఖ మంత్రి గా బాధ్యతలు నిర్వహించిన జ్యోతిరాధిత్య సింధ్యా ను, సంబంధిత అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాఖ నిర్వహణపరమైన మెలుకువలు, సంబంధిత శాఖలో ఉన్న బాధ్యతలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ అప్పగించిన బాధ్యతలను నిర్వహించేందుకు అవసరమైన కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వర్తించి పౌర విమానయ సంస్థ పనితీరు దేశ విదేశాలలో గుర్తింపు వచ్చే విధంగా పనిచేసి నిరూపిస్తాననిఅన్నారు. మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తూ తెలుగు రాష్ట్రాల అభివృద్ధికితన వంతు సహకారం అందిస్తానని, కేంద్రం ద్వారా అభివృద్ధికి అవసరమైన పనులు నిర్వహించేందుకు అన్ని మంత్రిత్వ శాఖ ద్వారా ప్రయత్నం చేసి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కేంద్ర మంత్రిగా దేశ అభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యం అధికంగా ఉంటుందని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# తెలుగువారి ఆత్మబంధువు రామోజీరావు

### వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు



**విజయనగరం బ్యూరో, జూన్ 11, మేజర్‌న్యూస్:** తెలుగు వెలుగులు ప్రసరింపచేసిన రామోజీరావు తెలుగువారి ఆత్మబంధువు అని వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈనాడు ఈటీవీ అధినేత రామోజీరావు సంస్మరణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అక్షరసూరీడు అస్తమించినా ఆ వెలుగులు శాశ్వతమని, ఆయన కీర్తి ఆచంద్రతారార్కమని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ ఆస్మా ఫర్వీన్ మాట్లాడుతూ రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలిఅని అభివర్ణించారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ నిరంతర శ్రమ, నిత్యం కొత్తదనం కోసం తపన, చెక్కుచెదరని ఆత్మస్థయిర్యం ఆయన స్వంతమని అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెసి నాయుడు, సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ గోటేటి హిమబిందులు మాట్లాడుతూ మొక్కవోని సంకల్పంకలిగిన నిత్యకృషీవలుడు రామోజీ అని, పత్రికా రంగంపై చెరగని సంతకం రామోజీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని మూడునిమిషాలపాటు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయ సంఘాల నాయకులు, ఈనాడు-ఈటీవీ సిబ్బంది, మార్గదర్శి సిబ్బంది, సాహిత్య సంస్థల ప్రతినిధులు, నాటకకళారంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు అనుగుణంగా స్కోడా

**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** స్కోడా ఆటో ఇండియా తమ నిరంతర వ్యూహా ల్లో భాగంగా, 5-స్టార్ సేఫ్ ఫ్లీట్‌లో మరో అప్ డేట్ ను అందించిందని మీడియా ప్రతినిధి తెలిపారు. కుషాక్ ఆనిక్స్ ఏటీ. స్కోడా అభిమానులు వినియోగాదరులకు అధిక విలువను అందించే లక్ష్యంతో ఆనిక్స్ ను అందిస్తుందని. ఈ కారుని 2023 మొదటి త్రైమాసికరంలో విడుదలచేశారని ఇప్పుడు స్కోడా ఆటో ఇండియా, తాజా గా వినియోగాదురుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా, ఇప్పుడు కుషాక్ ఆనిక్స్ ఆటోమేటిక్ టోన్స్ మిషన్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా మాట్లాడుతూ ఆనిక్స్ వేరియంట్ మా లైనప్ లో అద్భుతమైన కారు అని అధిక వేరియంట్ లఫీచర్లతో కలిపి ఒక కీలకమైన జోడింపుగా ఉందని ఈ కొత్త కుషాక్‌ఆనిక్స్ కస్టమర్ ల నుండి వచ్చిన ఫీడ్ బ్యాక్ కు అనుగుణంగా రూపొందించామన్నారు అందరికి అందుబాటులో ఉండే ధరవద్ద ప్రారంభమవుతుందని అన్నింటికి మించి ఆటోమేటిక్ వేరియంట్ లో ఇదే అత్యంత తక్కువ ధర ఉన్న కారు అన్నారు. అత్యధికంగా అమ్ముడైన ఎస్ యువీ,యాంబిషన్ వేరియంట్ లమధ్య స్లాట్ లనుకలిగి అధిక యాంబిషన్ వేరియంట్ నుండి ఎక్ష్టీరియర్స్ ఒకటి డీఆర్‌ఎల్ తో కూడిన స్కోడా క్రిస్టలైన్ లు మరోవై పు విజిబిలిటీ భద్రతను మరింత మెరుగు పరిచేవి స్టాటిక్ కార్నరింగ్ ఫంక్షన్ తో ఫ్రంట్ ఫాగ్ ల్యాంప్స్ ఉన్నాయన్నారు.

# గ్రాఫైట్ సిరీస్‌ను ఆవిష్కరించిన హయర్

**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** గృహోపకరణాలు విభాగంలో హయర్ ఇండియా ఎన్నో ఉత్పత్తుల్ని భారతదేశానికి అందించిదని మీడియా ప్రతినిధి తెలిపారు. వరుసగా 15 ఏళ్లపాటు నెంబర్ వన్ గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్ గా చరిత్ర సృష్టించిందని. ఇప్పుడు తాజాగా ప్రస్తుత సీజన్ కు ఎంతగానో ఉపయోగపడే విధంగా గ్రాఫైట్ సిరీస్ ను ఆవిష్కరించిందని . ఇది ఆధునిక భారతీయ గృహాల సౌందర్యాన్ని మరో స్థాయికి తీసుకు వెళ్లి అద్భుతమైన మ్యాట్టే ఫినిషింగ్ తో వస్తుందన్నారు అన్నింటికి మించి ఇవి సమకాలీన డిజైన్లో ప్రీమియం రేంజ్ స్టీల్ డోర్ రిఫ్రిజిరేటర్ లు. ఈ సిరీస్ 205 లీటర్ల నుంచి 602 లీటర్ల వరకు సామర్థ్యంలో అందుబాటులో ఉంటుందని ఇంటికి కావాల్సిన అన్ని స్టోరేజ్ అవసరాలను తీరుస్తుందన్నారు. తాజాగా ఆవిష్కరించిన సరికొత్త రేంజ్ రిఫ్రిజిరేటర్లు సొగసైన మ్యాట్టే ఫినిషింగ్ డిజైన్ను కలిగి ఉంటాయని. డైరెక్ట్ కూల్, టాప్-మౌంటెడ్, బాటమ్- మౌంటెడ్, 2-డోర్ సైడ్-టై-సైడ్, 3-డోర్ సైడ్- సైడ్ వంటి అనేక రకాల కాన్ఫిగరేషన్లలో ఈ సిరీస్ అందుబాటులో ఉన్నాయ న్నారు. ఈ సందర్భంగా హయర్ అప్లయన్సెస్ ఇండియా అధ్యక్షులు ఎన్. ఎస్. సతీష్ మాట్లాడుతూ హయర్ లో రోజువారీ జీవితాలను సుసంపన్నం చేసే కస్ట మర్-ప్రేరేపిత వినూత్న పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని.

### ఈ ఏడాది పది వేలు మొక్కలు

# నాటేందుకు ప్రణాళిక సిద్ధం

### గ్రీన్ బెల్ట్ అధ్యక్షుడు మూర్తి



**బొబ్బిలి, జూన్ 11, మేజర్‌న్యూస్:** పర్యావరణ వారోత్సవాలలో భాగంగా బొబ్బిలిలో వేరువేరు ప్రాంతాలలో గ్రీన్ బెల్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ ఏడాది సుమారు పది వేల మొక్కలు నాటుటకు ప్రణాళిక సిద్ధం చేసామని బొబ్బిలి గ్రీన్ బెల్ట్ అధ్యక్షుడు ఎస్ వి రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల,కళాశాల ల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని మూర్తి నొక్కి వక్కాణించారు. ఈ కార్యక్రమములో శశి భూషణ్, వెంకట నాయుడు, బాల భాస్కరరావు, మల్లేశ్వరరావు, లక్ష్మణరావు, అప్పలనాయుడు, శివ, గొంగాడ రామారావు, భార్గవి, నాగమణి, రాజేశ్వరి మొదలైనవారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

### శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు



**బొబ్బిలి, జూన్ 11, మేజర్‌న్యూస్:** బొబ్బిలి శ్రీ సత్య సాయి సేవ సమితి వారి ఆధ్వర్యంలో మంగళ వారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది.స్థానిక సత్య సాయి మందిరంలో జరిగిన ఈ శిబిరం లో కంటి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం వారి సహకారం తో కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు బి. వివేక్ వర్మ 96 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా,34 మందికి కేటరాక్ట్ సర్జరీ కి సిఫారసు చేశారు. బొబ్బిలి మండల పరిధి లోని గ్రామాలు నుంచి కంటి రోగుల రావడం శుభపరిణామం అన్నారు. వీరందరికీ శంకర్ ఫౌండేషన్ బస్ ద్వారా తీసుకొని వెళ్ళి,ఆపరేషన్ చేసిన తరువాత తిరిగి తీసుకొని వస్తారని వారు తెలిపారు. సర్జరీ కి ఎంపికైన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది.కార్యక్రమంలో సత్య సాయి కన్వీనర్ బి. లక్ష్మణరావు సేవా సమితి సభ్యులు కె. సింహాచలం, టి. వేణుగోపాల్ నాయుడు, ఎం. సూర్యం ఎ. మధు సిహెచ్ అప్పలనాయుడు క్యాంప్ ఇంచార్జి సిహెచ్ .వెంకట రమణ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలను

# సద్వినియోగం పరుచుకోండి

### నవ జీవన్ ట్రస్ట్ మేనేజర్ చిన్నమ్ములు



**సాలూరు, జూన్ 11, మేజర్‌న్యూస్:** నవజీవన్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఐ ఎం ఎ విజయనగరం వారి సహకారంతో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారిచే నిర్వహించబడుతున్న ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలను సద్వినియోగం పరుచుకో వాలని సాలూరు పట్టణానికి చెందిన నవజీవన్ ట్రెస్ట్ మేనేజర్ చిక్కాల చిన్నమ్మలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13వ తేదీ గురువారం సాలూరు పట్టణంలో నవజీవన్ ట్రస్ట్ వద్ద ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్త్రీలకు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయబడును అని అలాగే పురుషులకు మరియు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించబడినది తెలిపారు. ఈ వైద్య పరీక్షలలో 25 సంవత్సరాలు పైబడిన స్త్రీలు కు మాత్రమే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ మరియు మరీ ఇతర క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నవజీవన్ ట్రస్ట్ కోఆర్డినేటర్ చిక్కాల స్వాతి శ్రీ తెలిపారు.

# జగన్‌ని కలిసిన ధర్మాన సోదరులు

### - ప్రజా తీర్పును గౌరవిద్దాం
### - కార్యకర్తలకు అండగా ఉందాం
### - వైసీపీ జిల్లా నేతలకు జగన్ దిశా నిర్దేశం



**నరసన్నపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** తాడేపల్లి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికిశ్రీకాకుళం జిల్లా ముఖ్య నేతలు ధర్మాన సోదరులు,నాయకులుహాజరయ్యారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ కార్యకర్తలకు అండగా ఉందామని, ఓటమి కారణాలను విశ్లేషించుకుంటూ ప్రజల అభిమానాన్ని పొందేందుకు మళ్లీ ప్రయత్నం చేద్దామని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యకర్తలపై జరుగుతున్న తెలుగుదేశం పార్టీ వారు చేస్తున్న దాడులను నిలువరించి వైసిపి కార్యకర్తలకు అండగా నిలవాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లి సీఎం నివాసంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్, మాజీ రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్ల కిరణ్ కుమార్ తదితరులు కలిశారు. జిల్లాలో జరుగుతున్న పరిస్థితుల్లో అడిగి తెలుసుకున్నారు. వైసిపి శ్రేణులకు, కార్యకర్తలకు ఎటువంటి కష్టనష్టాలు కలగకుండా ప్రత్యర్థుల్ను దాష్టికాలను, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ కార్యకర్తలకు అండగా నిలవాలని జిల్లా నాయకులు కోరారు.

# పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవ సభకు బస్సులు



### *- జండా ఊపి బస్సులు ప్రారంభించిన జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్*

**శ్రీకాకుళం టౌన్, జూన్ 11, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదల పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకార మహోత్సవ సభకు బస్సులను శ్రీకాకుళం జిల్లా జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ ప్రారంభించారు. శ్రీకాకుళం లోని ఒకటో డిపోలో ఈ బస్సులను ఆయన జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దానేటి శ్రీధర్ మాట్లాడుతూ 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలతో జనసేన పార్టీ గెలుపు దేశ చరిత్రలోనే గొప్పదని చెప్పారు. రాష్ట్రంలో విముక్తి వైకాపా నినాదంతో వెళ్లిన పవన్ కళ్యాణ్ ను ప్రజలు ఆదరించారని తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎన్నో త్యాగాలు చేసిన పవన్ కళ్యాణ్ భవిష్యత్ తరాల నాయకుడని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించేందుకు ఎన్డీఏ కూటమితో భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా పవన్ కళ్యాణ్ కు ప్రశంసలు అందజేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జనసేన నాయకులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవ సభకు క్షేమంగా వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోవాలని డాక్టర్ దానేటి శ్రీధర్ ఆకాంక్షించారు.

# గ్రామ గ్రామాన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

**పార్వతీపురం, జూన్ 11, మేజర్‌న్యూస్:** జిల్లాలో గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ పారిశుధ్య డ్రైవ్ ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం పెద్ద ఎత్తున డ్రైవ్ ను నిర్వహించారు. సీతానగరం మండలంలోని కాసాపేట, చినభోగిల, లచ్చయ్యపేట, అంటిపేట తదితర గ్రామాలలో కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్‌ఓ) కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారి చేయించారు. జిల్లాలో గ్రామ పంచాయతీ స్థాయిలో పూడికలు తొలగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు, బావులు, కొలాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటి నుండే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దోమలపై దండ యాత్ర చేపట్టారు. జిల్లాలో దోమల వ్యాప్తి నివారణకు విధిగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి లార్వా వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పనిచేస్తూ చర్యలు చేపట్టారు. దోమల నివారణలో భాగంగా ఆయిల్ బాల్ లు, ఇతర కీటక నాశని



పదార్థాలు ఉపయోగించడం, తాగు నీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేయడం, తాగు నీరు కలుషితం కాకుండా శ్రద్ధ వహించారు. బ్లీచింగ్ వేయడం, తుప్పలు తొలగింపు, బహిరంగ మలవిసర్జన చర్యలు చేపట్టారు. ప్రజారోగ్య ఆవశ్యకత దృష్ట్యా పలు కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ, మలేరియా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# 13న పాఠశాలలు పునః ప్రారంభం

### - పాఠశాలల సంసిద్ధతకు హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలి
### - పార్వతీపురం ఎంఈవో సామల సింహాచలం వెల్లడి

**పార్వతీపురం, జూన్ 11, మేజర్‌న్యూస్:** వేసవి సెలవుల అనంతరం 13న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి-1 సామల సింహాచలం తెలిపారు. మంగళవారం ఆయన మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద విలేఖరులతో మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి హెచ్ ఎం లు పాఠశాల వాతావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించడం, అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు హెచ్‌ఎంలు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన విద్యార్థుల నమోదును చేపట్టాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, షూస్,బెల్ట్ తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్స్ ఇప్పటికే ఎంఈఓ కార్యాలయా లకు చేరాయ న్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటిని ఆయా పాఠశాలలకు అంద చేయడం జరుగుతుందన్నారు. స్టూడెం ట్స్ యూనిఫామ్ ఇంకా రావా ల్సి ఉం దని, వచ్చిన వెంటనే వాటిని పాఠశాల లకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని ఎంఈఓ సామల సింహాచలం పేర్కొన్నారు.



# గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియమకానికి ఎంపికలు

### - 15న ఇంటర్వ్యూలు
### - అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు డెమోకు హాజరు కావాలి
### - జిల్లా సమన్వయకర్త ఎస్. బాలాజీ నాయక్

**శ్రీకాకుళం టౌన్, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నడపబడుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యాలయాల్లో 2024 -25 విద్యా సంవత్సరానికి టెస్ట్ ఫ్యాకల్టీ నియమికానికి ఈనెల 15న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయకర్త బాలాజీ నాయక్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం దుప్పలవలస, కొల్లివలస ఉన్న గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్స్ మ్యాచ్ తో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం మందస లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ ఇంగ్లీష్ , బొటనీ, పిజిటి మ్యాథ్స్ లో అభ్యర్థులు కావాలన్నారు. అలానే బి.ఆర్ .అంబేద్కర్ గురుకులం నందిగం బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ మ్యాథ్స్ మహిళా అభ్యర్థి మాత్రమే నియమికానికి కావాలని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు పీజీ బీఈడీ టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు తమ బయోడేటా ధ్రువపత్రాలతో ఈ నెల 15న గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు డెమో సమర్పించేందుకు హాజరుకావాలని జిల్లా సమన్వయకర్త బాలాజీ నాయక్ తెలిపారు.

### శాసనసభా పక్ష సమావేశంలో

# శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, జూన్ 11, మేజర్‌న్యూస్:** విజయవాడ ఏ 1 కన్వెన్షన్ హాల్ లో జరిగిన ఎన్డియే శాసనసభా పక్ష సమావేశంలో కూటమి శాసనసభ్యులు, శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని శాసన సభ్యులతో కలసి శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ శాసనసభ్యులు గొండు శంకర్ పాల్గొన్నారు. అయనతో పాటు నరసనపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సమావేశంలో పాల్గొన్నారు. టి డి ఎల్ పి నేతగా (ఎన్డీఏ పక్ష నేతగా) చంద్రబాబు ఎన్నిక సందర్భంగా నిర్వహించిన ఈ సమావేశంలో పాల్గొని మద్దతు తెలియజేసిన శాసనసభ్యులు.

# భవిష్యత్తు ఊహించకపోవడం జగన్ వైఫల్యం

### మాజీ మంత్రి గుండా అప్పల సూర్యనారాయణ

**శ్రీకాకుళం టౌన్, జూన్ 11, మేజర్‌న్యూస్:** గతాన్ని గుర్తు చేసుకుంటూ వర్తమానాన్ని గమనిస్తూ భవిష్యత్తును అంచనా వేయగలిగే వారే రాజకీయాల్లో రాణించగలరని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలు స్పందిస్తూ ప్రజల్లో ఎందుకు ఇంత వ్యతిరేకత వచ్చిందని విషయం అర్థం కాలేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యానించడానికి ఆయన ఒక ప్రకటన ఎద్దేవా చేశారు ఉద్యోగ వర్గాల్లోనే వైకాపా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నట్లు అర్థమైందని జగన్ పేర్కొండాన్ని తప్పుపట్టారు. ఎన్నికల ముందు హైదరాబాదులో టిడిపి అధినేత చంద్రబాబును కలిసినప్పుడే ఈ ఎన్నికల్లో వైకాపా ఓడిపోతుందని తమ ఆయనతో చెప్పమన్నారు అలాగే దేశంలో ఎమర్జెన్సీ విధించిన అప్పటి ప్రధాని ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత ఎన్నికల్లో ఓడిపోతారని అందరు ఊహించగలిగారని గుర్తు చేశారు. గత వర్తమాన పరిణామాలను ఆకలింపు చేసుకుంటే భవిష్యత్ ఫలితాలను అంచనా వేయడం కష్టం కాదన్నారు. సిద్ధాంతాల ఆధారంగానే రాజకీయాలు నడవాలి తప్ప ఆర్థిక లావాదేవీలతో ఎల్లకాలం నడవలేమన్నా విషయాన్ని కూడా గ్రహించాలన్నారు.

# ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో బగ్గు



**నరసన్నపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి విజయవాడలో ఎ వన్ కన్వంక్షన్ హల్ లో జరిగిన ఎన్డీయే శాసన సభా పక్ష సమావేశంలో ఉమ్మడి కూటమి శాసన సభ్యులు మరియు శ్రీకాకుళం పార్లమెంట్ పరిధి శాసన సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ శాసనసభ పక్ష నాయకుడిగా చంద్రబాబును ఎన్నుకునే కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలియజేశారు. బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రమణ మూర్తి తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలసి పాల్గొంటారు.

### జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో

# సత్తా చాటిన మారెళ్ళ వినయ్ కుమార్



**నరసన్నపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** 2024 ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో నరసన్నపేట మండలం మడపాం గ్రామానికి చెందిన మారెళ్ళ వినయ్ కుమార్ తన ప్రతిభ చాటాడు. ఆల్ ఇండియా ఎస్సీ కేటగిరి విభాగంలో 1680 వ ర్యాంకు సాధించి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి వినయ్ ను గ్రామస్తులు అభినందించారు. చిన్నప్పటి నుండి చదువు పట్ల ఎంతో ఆసక్తి కనబరిచిన మారెళ్ళ వినయ్ జాతీయ సంస్థల్లో ఇంజనీరింగ్ పూర్తిచేయాలని తపనతో కోరికతో ఈ విజయం సాధించినట్లు తెలియజేశారు. వినయ్ తండ్రి మారెళ్ళ అప్పలనాయుడు రాష్ట్ర వీఆర్వో సంఘ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, నరసన్నపేట వీఆర్వో గా పని చేస్తున్నారు. తల్లి సుదీష్ణ గృహిణిగా ఉన్నారు. తమ కుమారునికి ఆల్ ఇండియా స్థాయిలో గుర్తింపు రావడం పట్ల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రైతు కుటుంబానికి ఆదుకున్న స్వచ్ఛంద సంస్థలు



**నరసన్నపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** పోలాకి మండలం, అంపలాం గ్రామానికి చెందిన రైతు పోతల ఆదినారాయణ ఈ మధ్యకాలంలో వడదెబ్బకు ఆకస్మాత్తుగా మరణించారు, రోజువారి కూలికి పనిచేసే ఈయన చనిపోవడం వలన కుటుంబం అప్పులు ఊబిలో పడ్డారు, తన భార్య దీనావస్థితిలో ఉన్నారు, తన కుమార్తె దగ్గర తలదాచుకుంటున్నారు. ఆరోగ్యం బాగోలేక వారికీ కూడా భారం అయినారు. దాతలు సహాయం చేసి ఆదుకోవాల్సిందిగా ప్రార్థిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీటీకె సోషల్ సర్వీస్ మరియు సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి తరుపున 10,000/- ఆర్థిక సహాయం మరియు రెండు నెలలకి సరిపడా నిత్యవసర సరుకులు అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రమేష్, రామారావు, లక్ష్మీనారాయణ (చిన్నారావు), త్రినాధరావు మరియు వరప్రసాద్ పాల్గొన్నారు.

# 419వ రోజుకి చేరుకున్న అన్నా క్యాంటీన్



**శ్రీకాకుళం టౌన్, జూన్ 11, మేజర్‌న్యూస్:** గొండు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ 419వ రోజు యధావిధిగా కొనసాగింది. నగరంలోని ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో వందలాది మంది ఆకలి తీర్చుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ మహత్తర కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుంది. వచ్చిన వారికి లేదనకుండా ఉచితంగా కడుపునిండా ఆహారాన్ని అందజేస్తున్న అన్నా క్యాంటీన్ నిర్వహణను చేపట్టిన గొండు శంకర్ ను అన్నార్తులతో పాటు నగర వాసులు అభినందిస్తున్నారు. 419రోజులుగా వందలాది మందికి రుచికరమైన భోజనాలు అందించడం సామాన్య విషయం కాదని, ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన అయను కొనియాడుతున్నారు.

# మలేరియా నియంత్రణకు సమిష్టి కృషి చేయాలి



**సీతంపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** మలేరియా నియంత్రణకు సమిష్టి కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. దోనుబాయి పిహెచ్సిలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని సమీక్ష జరిపారు. గ్రామాల్లో మలేరియా తదితర జ్వరాలు ఏ మేర కు నమోదు అవుతున్నాయి, ఏ విధమైన నియంత్రణ చర్యలు చేపడుతున్నారు మొద లైన అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. జ్వరాలను సకాలంలో గుర్తించి, క్షేత్ర స్థాయిలోనే నిర్ధారణ పరీక్షలు జరపాలని ఆదేశించారు. డ్రైడే కార్య క్రమాలు ప్రతీ రోజూ నిర్వహించి దోమల లార్వా నిర్మూలన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తించడంలో జాప్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయన్నారు. మారుమూల గ్రామీణ ప్రజలకు ఆ పరిధిలో ఉన్న వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలందించాలన్నారు. గర్భిణీ,శిశువుల ఆ రోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించి మలేరియా నియంత్రణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఎస్.భాను ప్రతాప్, ఏఎంఓ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, కార్యాలయ సిబ్బంది ప్రసాదరావు, ఈఓ రాజారావు, సూపర్వైజర్స్, వైద్య సిబ్బంది,

## తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య శాఖ అధికారులు సందర్శన



**భీమునిపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , రాజుల తాళ్లవలస ను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అదికారి, విశాఖపట్నం వారు ఆశ డే సమావేశం నిమిత్తం సందర్శించినారు. ఈ సందర్భముగా బిసిజి వాక్సినేషన్ కోసం మోటివేషన్ కార్యక్రమం నిర్వహించి, ఈ కార్యక్రమం బాగా చెయ్యాలని ఏ.ఎన్. ఎమ్ ను, ఆశ లను హెచ్చరించి నారు. మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యొక్క సేవలు, అన్ని జాతీయ కార్యక్రమాలు పై రివ్యూ చేసి రికార్డ్స్ పరిశీలించినారు. ఆసుపత్రి యొక్క పరిసరాలు అన్ని సందర్శించినారు. ఈ కార్యక్రమం లో డి. ఎమ్.హెచ్. ఓ. డా. జగదేశ్వరరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఉమావతి, ఎన్. హెచ్. ఎమ్. టీమ్, తాళ్లవలస మెడికల్ ఆఫీసర్, పి. హెచ్. సి. సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీశ్రీశ్రీ కొత్తమ్మ తల్లిని దర్శించుకున్న

## గంటా సతీమణి శారదమ్మ



**తగరపువలస, జూన్ 11, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ 2వ వార్డ్ లో సంతపేట కొత్తపేట శ్రీ శ్రీ శ్రీ కొత్తమ్మ తల్లి పసుపు కుంకుమ మహోత్సవం వారాలు పండుగ సంధర్భంగా భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సతీమణి గంటా శారదమ్మ కొత్తమ్మ తల్లి గుడికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. వారితో పాటు కుటుంబ సభ్యులు మాలతి, నిరుపమ పూజలు చేయించుకున్నారు. అలాగే గంటా శారద హెల్పింగ్ హాండ్స్ ద్వారా గంటా శారదమ్మ భక్తులకు మజ్జిగ ఏర్పాటుచేసి ఆమె చేతుల మీదుగా కొంత మంది భక్తులకు మజ్జిగ అందజేశారు గంటా శ్రీనివాసరావుని అత్యధిక మెజారిటి తో గెలిపించిన ప్రజలకి అంత మంచి జరగాలి అని కోరుకున్నారు. భీమిలీ ప్రజలకి ఎప్పుడు అవసరం ఉన్న తాను అందుబాటలో వుంటాను అని ప్రజలకి ,కార్యకర్తలకి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శారదమ్మ హెల్పింగ్ హేండ్స్ టీం మెంబర్స్ మరియు భక్తులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలతో చెరువు పనులు

## చేపట్టి భూగర్భ జలాలు పెంచండి



**అనకాపల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో సర్వేనెంబర్ 385లో ఉన్న 2.85 ఎకరాల చెరువును మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేయాలని ఆ పథకం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సందీప్ ను కోరామని భారతీయ జనతా యువ మోర్చా జిల్లా కార్యదర్శి పీత నానాజీ అన్నారు. ఈ మేరకు ఒక వినతి పత్రం అందజేశామని, అన్ని గ్రామాల్లోనూ ప్రస్తుత పరిస్థితులను( వేసవి ) దృష్టిలో ఉంచుకొని ఒకసారి పరివేక్షణ చేపట్టాలని కోరారు. దీనిలో భాగంగా సంపూర్ణ ప్రకృతి వైపరీత్యాల వల్ల అడుగంటిపోతున్న భూగర్భ జలాలు తిరిగి పుంజుకునే చర్యలలో భాగంగా తక్షణమే ఈ చెరువు అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గ్రామంలో ప్రజలకు ఉపాధి కలుగుతుందని, భూగర్భ జలాలు రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుందని, తద్వారా పరిసర ప్రాంతాల ప్రకృతి పరిరక్షణ, ప్రజలకు కావలసిన త్రాగునీరు అందుతుందని, దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరామన్నారు.

## సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం



**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** ప్రతి వేసవి సెలవుల్లో శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవ సంస్థ వారు సంస్థ ట్యూషన్ విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుంది..ఈ సంవత్సరం సమ్మర్ క్యాంపులో భగవద్గీత అధ్యయనం, పురాణ ఇతిహాసాలపై అవగాహన తరగతులు బోధించడం జరిగింది. ఈరోజు ఈ సమ్మర్ క్యాంపులు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులు, యువ నాయకులు ద్రోణం రాజు. శ్రీవత్సవ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు అనర్గళంగా , చక్కగా చదివారు, వారికి ప్రముఖుల చేతుల మీదుగా చక్కటి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వాత్సవ్ గారు మాట్లాడుతూ, ప్రతి వేసవికాలంలోనూ విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తూ, సమ్మర్ క్యాంప్ లో భాగంగా విద్యార్థులకు భగవద్గీత అధ్యాయనాలు, పురాణ ఇతిహాసాలు, ఆధ్యాత్మిక యాత్రల ద్వారా భక్తి భావన పెంపొందించి, విద్యార్థులను మంచి మార్గంలో నడిపిస్తున్న సంస్థ వారికి అభినందనలు తెలియజేశారు. చివరగా విద్యార్థులకు స్నాక్స్ ని అందించి, ఈ కార్యక్రమానికి ముగింపు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు విద్యార్థులు లక్ష్మి, హారిణి, నిఖిత, రక్షిత, జాహ్నవి, కీర్తి మరియు సమస్త మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుండి అద్భుత పాలన చూస్తాం

### : సీతంరాజు సుధాకర్




**విశాఖపట్నం, జూన్ 11, మేజర్ న్యూస్:** నేటి నుండి అద్భుత పాలన చూస్తాం అని దక్షిణ నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్ అన్నారు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా విశాఖ టిడిపి కార్యాలయం నుంచి విజయవాడలో సీఎం ప్రమాణ స్వీకార వేడుకకి బయలుదేరిన బస్సులకు సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఎదురు చూసిన క్షణాలు ,నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి గా ప్రమాణ స్వీకారం అని అన్నారు వైసిపి అరాచక పాలన నుంచి విసిగిపోయిన క్షణాలు నుంచి ఒక అద్భుత పాలన చూస్తాం అని పేర్కొన్నారు . కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్పొరేటర్లు, నాయకులు , కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## చెత్త పన్ను వసూలు నిలిపివేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం

**తగరపువలస, జూన్ 11, మేజర్‌న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, నగర,గ్రామీణ ప్రాంతాల్లో చెత్తపన్ను వసూళ్లను నిలిపివేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చిట్టివలస లో నిర్వహించిన మీడియా సమావేశంలో విశాఖ పార్లమెంటరీ సెక్రటరీ పిట్ట సురేష్ అన్నారు. ప్రజలు చెల్లించే ఇంటి పన్నుకు లైబ్రరీ, శానిటేషన్, ఫైర్, స్పోర్ట్స్, వీధిలైట్లు వంటి సౌకర్యాలను కల్పించాల్సిన భాద్యతలు ఆయా మున్సిపాలిటీలు,నగరపాలక సంస్థలపై ఉన్నాయని గుర్తు చేశారు. ఇక జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక చెత్త సేకరణ పేరుతో యూజర్ చార్జీలను వేరు చేసి, ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని గతంలోనే తాను ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించి, ఆ చెత్త జి. ఓ . ను రద్దు చేయాలని వినతులిచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబును అధికారంలోకి తెచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రమాణస్వీకారం కాకముందే చెత్తపన్ను వసూళ్లను నిలిపివేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయకముందే ప్రజా రంజక పాలన మొదలైంది అని అన్నారు. ఇక తమ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధితో పాటు రాష్ట్రానికి ఆదాయం వచ్చే విధంగా



పాలన జరగబోతోందని పిట్ట సురేష్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు భీమవరపు ప్రకాష్, అల్లు రవి, పల్ల అప్పలకొండ, చెన్నమల గిరి, పెంద్యాల మహేష్, పిట్ట రామారావు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యాకానుక కిట్ల నాణ్యతపై అధికారులు దృష్టి పెట్టాలి

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** ప్రతీ ఏడాది మొదటి విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసే విద్యా కానుక కిట్ల నాణ్యత విషయంలో అధికారులు దృష్టి పెట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తుందని అన్నారు. కానీ వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత రంగులకు, ఫోటో స్టిక్కర్లకు ప్రాధాన్యత ఇచ్చారే తప్పా నాణ్యతపై శ్రద్ధ తీసుకోలేదని అన్నారు. స్కూల్ బ్యాగులు, బెల్టులు, షూ లు విద్యార్థులకు ఇచ్చిన మొదటి నెలనుండే చిరిగిపోవడం మొదలవుతుందని అన్నారు. నాటి ప్రభుత్వ పెద్దలు వారి అనుచరగనాలకు కాంట్రాక్టులు ఇచ్చి నాసిరకం మెటీరియల్ వాడారని గంటా నూకరాజు ఆరోపించారు. దోచుకోవడం దాచుకోవడం తప్ప జగన్ రెడ్డి సర్కార్ చేసిన నిర్వాకం ఏమి లేదని అన్నారు. దయచేసి విద్యాశాఖ అధికారులు పునరాలోచన చేసి ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాలని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుండి అందించే ఏ కానుక అయినా నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు విజ్ఞప్తి చేసారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం వేరని అన్నారు. విద్యకు సంబంధించి నారా చంద్రబాబు నాయుడు చరిష్మా అధికారులు గుర్తించాలని గంటా నూకరాజు అన్నారు.

## ఆంధ్ర ప్రదేశ్‌ని బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలి

### : కేసలి అప్పారావు

**విజయనగరం బ్యూరో, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ఈ రోజు విజయనగరం తోటపాలెంలో తన క్యాంపు కార్యాలయంలో రేపు జరగబోవు అంతర్జాతీయ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల కార్మిక వ్యతిరేక మాసం నేపథ్యంలో విజయవాడ కి చెందిన క్రాఫ్ వారు రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ ఇన్చార్జి అధికారి యాళ్ళ నాగరాజు ,సిబ్బంది బి రామకోటి, వి . సంధ్య, చైల్డ్ లైన్ సిబ్బంది సి హెచ్ అరుణ్ కుమార్, వి.మీనా వైసిబి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జీ .ఝాన్సి రాణి మరియు ఫాల్గుణ పాల్గొన్నారు. బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలి నీ, ఏ ఒక్క బాలలను పనిలో గానీ ప్రమాద భరిత రంగాల్లో పెట్టుకుంటే వారిపై కేసులు నమోదు చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు బాలలు తో బాలలు కోసము పనిచేస్తున్న ప్రభుత్వ ,ప్రభుత్వేతర సంస్థలు,స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు రాష్ట్రంలో



బాలకార్మికులు లేకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టి వాటిపై అవగాహన కల్పించడం చేయాలని కోరారు. ముఖ్యంగా అంగన్వాడీ సిబ్బంది,సచివాలయం సిబ్బంది, కార్మిక శాఖ, పోలీసు శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రైల్వే శాఖ, మున్సిపల్,పంచాయతీ,రెవెన్యూ శాఖ, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మరియు ఇతర శాఖల భాగస్వామ్యంలో పూర్తి స్థాయిలో బాల కార్మిక వ్యవస్థను రూపు మాపి 2025 చివరి నాటికి రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో బాలకార్మిక రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దడము జరుగుతుందని తెలిపారు.

## రోడ్డున పడనున్న ప్రభుత్వ ఔట్ ఫోర్సింగ్ ఉద్యోగులు




**సాలూరు, జూన్ 11, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో గత ప్రభుత్వం వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నూతన ప్రభుత్వ మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వమే షాపులను ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో 3600 ప్రభుత్వ మద్యం దుకాణాలలో సుమారు 18 వేల మంది సేల్స్ మెన్, సూపర్వైజర్లుగా ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. ఇంటి బాధ్యతలు వారిపై ఉండడంతో డిగ్రీలు, పీజీలు చదువుకున్నప్పటికీ ఏదో ఒక చిన్నపాటి ఉద్యోగమైన చేసుకోవాలనే ఆలోచనతో వారు చదువుకున్న చదువుకి సరిపోక పోయినప్పటికీ ఆ చిన్నపాటి ఉద్యోగులలో చేరి ఇంటి బాధ్యతలకు లోబడి సర్దుకుపోవడం వారి నైజం అయిపోయింది.. అయితే ఇలా ఉండగా గత ప్రభుత్వం ప్రభుత్వ మద్యం పాలసీల్లో భాగంగా ప్రభుత్వ మద్యం షాపులలో పనిచేయుట కొరకు సేల్స్ మెన్ పోస్ట్ కు ఇంటర్ అర్హత పెట్టగా, సూపర్వైజర్ పోస్టులకు డిగ్రీ అర్హతగా పెట్టడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడంతో

### కొత్త మద్యం పాలసీ వస్తే సేల్స్ మాన్ సూపర్వైజర్ల భవిష్యత్తు ప్రశ్నార్ధకమే

చదువులు పూర్తి చేసి ఖాళీగా ఉండడంతో చాలామంది యువకులు ప్రభుత్వ వైద్యం షాపులలో పనిచేయుట కొరకు ముందుకు వచ్చారు. కోవిడ్ లో సైతం ధైర్యంగా తమ ఉద్యోగ విధులను నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ఆదాయాన్ని సమకూర్చడంలో తమ యొక్క పాత్రను పోషించడం జరిగింది.

**కొత్త మద్యం పాలసీ తో 18 వేల యువకుల భవిష్యత్తు ప్రశ్నార్ధికమే...!**

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా మద్యం పాలసీనీ తీసుకువచ్చి ప్రభుత్వ మద్యం షాపులను ప్రైవేటీకరణ చేస్తారనే వార్తలు రావడంతో ప్రస్తుత ఉన్న ఉద్యోగులను తొలగిస్తారని రాష్ట్రంలో మద్యం షాపులలో పనిచేస్తున్న 18 వేల మంది యువకులులో ఆందోళన మొదలయ్యింది. ఇప్పటి వరకు ప్రభుత్వ తరపున పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తే 18,000 మంది యువకులు భవిష్యత్తు రోడ్డున పడటమే కాకుండా 18 మంది యువకుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి ఏ ఇతర ఉద్యోగాలకు వెళ్లి ప్రయత్నించిన గతంలో ప్రభుత్వ మద్యం షాపులలో పనిచేసిన అనుభవాన్ని తీసుకోవడం లేదని వారంతా వాపోతున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న ప్రభుత్వం మా యందు దయ చేసి వివిధ ప్రభుత్వ శాఖలలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో తమ సేవలను వినియోగించుకోవాలని వారంతా వేడుకుంటున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మద్యం పాలసీ విషయంలో ప్రభుత్వ నిర్ణయం తీసుకునే ముందు 18,000 మంది ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుంటారని కోరుతున్నారు. ఇప్పుడు నూతనంగా ఏర్పాటు కానున్న ప్రభుత్వం మద్యం పాలసీలో ఏ నిర్ణయం తీసుకుంటుంది అనే అనేది వేచి చూడాల్సి ఉంది.

## మన ఆచార సాంప్రదాయాలను పాటిద్దాం

**అచ్చుతాపురం, జూన్ 11, మేజర్‌న్యూస్:** మన హిందూధర్మంలో ఆచార సాంప్రదాలు మన ఆరోగ్యాని ఎంతగానో ఉపయోగ పడతాయని ,మన ఆచార సాంప్రదాయాలను పాటిద్దామని "సమరసతా సేవా ఫౌండేషన్" ఎలమంచిలి ఖండ సంయోజకులు బి వి రమణ అన్నారు.ఎమ్ జగర్నథపురం లో ఇంటింటా ధర్మప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవజాతి ఆవిర్భానుండి సనాతన ధర్మాన్ని పాటించటం జరుగుతుందని ,మన జీవన విదానంలో మన ఆరోగ్యపరిరక్షణ కొరకు కొన్ని నిబందనలు,ఆచార సాప్రదాయాలు నియమించారు.ఇప్పుడు ఎవరో వచ్చి ఏదో మతమని మాయమాటలు చెప్పి నుదిటి న బొట్టు,వాకిట కల్లాపు, గుమ్మానికి పసుపు ,పెరటిలో తులసి చెట్టు లాంటివి మనకు దూరం చేస్తున్నారు.వాటిని పాటించటం ద్వారా కొన్ని అనారోగ్య సమస్యలనుండి బయట పడవచ్చు అని మన సనాతన ధర్మం గురించి అందరూ తెలుసుకోవాలన్నారు.అనంతరం ఇంటింటికి స్టిక్కరును అతికించి ,కరపత్రం అందించటం జరిగింది. ఈ కార్యక్రమములో యలమంచిలి



ఖండ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు ,మహిళా కో కన్వీనర్ బంటు రాము,భీముని,జోగినాయుడు,బంటు ఆనంద్, పీలా శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కుర్రపల్లి గ్రామంలో భక్తి శ్రద్ధలతో నల్లమారమ్మ అమ్మవారి ఉత్సవం

**పద్మనాభం, జూన్ 11, మేజర్‌న్యూస్:** మండలంలో కుర్రపల్లి గ్రామంలో కొలువు దీరిన నల్లమారమ్మ తల్లి అమ్మవారి ఉత్సవంను మంగళవారం గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం కుర్రపల్లి కాలనీ నుండి డప్పులు, డి.జె.వాయిద్యాలతో ప్రజలు పసుపు,కుంకుమలతో బయలుదేరి గ్రామంలో ఉన్న కమ్మలపాకలో అమ్మవారికి పూజలు చేసారు. అనంతరం అక్కడ నుండి అమ్మవారి గుడిదగ్గరకు చేరుకొని విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో ఈఉత్సవంను చేయడం ఆనవాయితీ. అంతేకాకుండా తగరపువలస రోడ్డు పక్కన అమ్మవారు కొలువు దీరడంతో ప్రయాణికులు కూడా పూజలు చేసారు. ఈ సందర్భంగా భక్తులకు మజ్జిగను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఘనంగా పరదేశమ్మ పండుగ మహోత్సవం



**చోడవరం, జూన్ 11, మేజర్‌న్యూస్:** మండలంలోని గజపతినగరం గ్రామంలో గల పరదేశమ్మ పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పండుగ సందర్భంగా ఉదయం నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ చీర, సారె ,సమర్పించి ధూప, దీప, నైవేద్యాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గజపతినగరం, జుత్తాడ గ్రామానికి చెందిన మహిళా బృందం చే కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్థానిక భజన బృందం చే బైటో భజన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరదేశి అమ్మవారి ఆలయఉత్సవ కమిటీ, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి

## కనకమహాలక్ష్మి రాజీనామా



**నర్సీపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు నర్సీపట్నానికి చెందిన రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ ప్రత్యేక ముఖ్య కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పంపించినట్లు ఆమె మంగళ వారం విలేకరులకు వెల్లడించారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో తనకు అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్గా నామినేటెడ్ పదవి లభించిందని, గత సార్వత్రిక ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం ఘోర పరాజయం పాలవడంతో స్వచ్ఛందంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి రాంగోపాల్ పాల్గొన్నారు.

## కూటమి గెలుపుపై శ్రేణులు సంబరాలు



**దేవరాపల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ, పొలమాంబ తల్లికి కూటమి శ్రేణులు మొక్కులు చెల్లించారు. మంగళవారం ఆయా గుడిల వద్ద హనుమాన్ యూత్,లవ్ లీ యూత్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి గెలిచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మొక్కుబడి చెల్లించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గుల్లిపల్లి మురళి, సబ్బవరపు మాలిబాబు, కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### డిల్లీలో కేంద్ర మంత్రులును కలిసిన

## బి.జె.వై.యమ్ రాష్ట్ర పదాధికారి అడిగర్ల సతీష్



**నర్సీపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారానికి నర్సీపట్నం నుండి ఆహ్వానంపై ఢిల్లీ వెళ్లిన బీజేవైఎం రాష్ట్ర పదాధికారి అడిగర్ల సతీష్ మంగళవారం కేంద్ర మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నూతన కేబినెట్ లో తెలుగు రాష్ట్రాల నుండి స్థానం పొందిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ లను డిల్లీలో వారి నివాసంలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఆయన ఫోన్లో సూర్య విలేకరితో మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుండి కేంద్ర మంత్రులుగా ఎదగడం ఎంతో ఒక్క బి.జె.పి లోనే సాధ్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేసి నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కేంద్ర మంత్రులను కోరినట్లు తెలిపారు.

## కుంచాలమ్మ, దుర్గమ్మవార్ల జాతరలో 'వాసుపల్లి'



**విశాఖపట్నం, జూన్ 11, మేజర్‌న్యూస్:** కోరిన కోర్కెలు నెరవేర్చే కుంచాలమ్మ దుర్గమ్మ అమ్మవారి పండుగ మహోత్స వం అంగరంగ వైభవంగా జరుగుతుందని దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 104 ఏరియాలో మంగళవారం సాయంత్రం జరిగిన జాతర కు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకు న్నారు. వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులను ఆల య కమిటీ సాదరంగా ఆహ్వా నించి ప్రత్యేక పూజలు చే యించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే ఈ జాతర పాల్గొనడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆలయా న్ని సర్వాంగ సుం దరంగా విద్యుత్ అలంకరణ పూల అలంకరణ తీర్చిదిద్దారని కొనియాడారు. ఆం ధ్ర రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసు పల్లి గణేష్ కుమార్ సతీమణి రాణి, కుమారుడు సూర్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విషయంలో
# కొత్త ప్రభుత్వం మంచి నిర్ణయం
### యథావిధిగా విద్యాకానుక కిట్లు



**పలాస/మందస, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మారడంతో 'జగనన్న విద్యాకానుక' కింద అందించే ఉచిత పుస్తకాలు,యూనిఫామ్ తో కూడిన కిట్స్ సంగతేంటనే ప్రశ్న తలెత్తింది. ఎందుకంటే వీటి మీద మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పేరు ఉంటుంది కాబట్టి. అయితే వీటిని యథావిధిగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్కూళ్లు ప్రారంభమయ్యే జూన్ 13 నుంచే పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. అటు గత ప్రభుత్వంలో విద్యా కానుకలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో వాటిపై విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# రేషన్ డీలర్ల కమీషన్ పెంపు
### రేషన్ షాపు వద్దే బియ్యం పంపిణీ

**పలాస/మందస, జూన్ 11, మేజర్‌న్యూస్:** 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పథకం కింద వాహనాల ద్వారా అందించే విధానం రద్దు చేసే దిశగా చర్యలు తీసుకున్నట్టు సమాచారం గత ప్రభుత్వం నిత్యవసర సరుకులు రేషన్ డీలర్లు కమీషన్స్ రేషన్ డీలర్ల కమీషన్ పెంపు పై సమీక్ష చేయనున్న నూతన ప్రభుత్వం అని తెలుస్తుంది ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ మారే కొద్ది పదకాలు కూడా మారుతుందని చెప్పక తప్పదు.

## గ్రామ పంచాయతీల్లో
# ముమ్మరంగా పారిశుధ్యం పనులు
### - సర్పంచ్ చంద్రినాయుడు, కార్యదర్శి తిరుపతి భాస్కరరావుల ఆధ్వర్యం లో పారిశుధ్యం పనులు
### - పనులు పరిశీలించిన ఈ ఓ పి ఆర్ డి గోపాలరావు



**గరుగుబిల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీల్లో రెండవ విడత ముమ్మరంగా పారిశుధ్యం పనులు చేపడుతున్నారు. ఈమేరకు మండల పరిధిలోని గొట్టివలస తదితర గ్రామాల్లోని పక్కా కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ బోను చంద్రినాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి భాస్కరరావులు తెలిపారు. గొట్టివలస గ్రామపంచా యతీలో చేపడుతున్న పారిశుధ్యం పనులను మండల ఈ ఓ పి ఆర్ డి ఎల్ గోపాలరావు పరిశీలించారు. అదేవిధంగా మండల పరిధిలోని ఆవ గ్రామపంచాయతీలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

# పిహెచ్‌సిలో ఆశడే కార్యక్రమం
### - కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్
### - ఆశవర్కర్లకు సూచనలు అందజేసిన హెచ్ వి ఉదయకుమారి



**గరుగుబిల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ కిల్కారి కాల్స్ పై అవగాహన కల్పించటంలో ఆశలు అనుసరించవలసిన అంశా లు గురించి పలు సూచనలు సలహాలు అందజేశారు. డయే రియా, విరోచ నాలు, వాంతులు, రాకుండా ఉండేలా తగు సూచనలు చేశారు. హైరిస్క్ గర్భిణీలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలో డాక్టర్ సంతోష్ కుమార్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ వి చింతాడ ఉదయకుమారి మాట్లా డుతూ గర్భిణీలకు వైద్య, పరీక్షలు సకాలంలో నిర్వహించ డంతోపాటు గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారికి ఏమీ అయిన ఇబ్బంది వచ్చినయెడల తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. పి హెచ్ సి లో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రక్త హీనత, హైరిస్క్ సమస్యలకు గర్భిణీలు గురికాకుండా వైద్య, సిబ్బంది కృషి చేయాల న్నారు. ఈకార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పిలు, ఎ ఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో పశువులకు వచ్చే
# వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
### - పశుసంవర్ధకశాఖ కార్యక్రమాలు అమలుపై సిబ్బందితో సమీక్ష
### - పశుసంవర్ధకశాఖ ఏడి డాక్టర్ గణపతిరావు, డాక్టర్ సురేష్ కుమార్‌లు వెల్లడి



**గరుగుబిల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** వర్షాకాలం సీజన్ లో పశువులకు ఆశించే పలు రకాల వ్యాధులపై పశుసంవర్ధక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గరుగుబిల్లి ఏరియా పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి గణపతిరావు వెల్లడించారు. మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయా గ్రామాల పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి గణపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో పశుసంవ ర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను నిర్దేశించిన సమయంలోగా రైతులకు అందజేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలకు సంబంధించి సిబ్బంది నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాలను అధిగమించాల్సి ఉందన్నారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను సకాలంలో వేయాల్సి ఉంద న్నారు. అదే విధంగా గొర్రెలు, మేకలకు, చీడపారుడు వ్యాధి నివారణకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పశువైద్య సిబ్బంది మంత్రబుద్ది శ్రీరాములునాయుడు, ఏ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌డిఏ ఉమ్మడి మ్యానిఫెస్టోను విడుదల చెయ్యాలి
### ఆంధ్ర ఒడిశా బార్డర్ మావోయిస్టు నేత గణేష్ డిమాండ్

**జి మాడుగుల, జూన్ 11, మేజర్‌న్యూస్:** దేశంలో, ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు తమ తమ పార్టీలకు అనుగుణంగా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది తప్పా కేంద్ర ప్రభుత్వం లో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేయలేదని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించి, అమలు చేయాలని ఆంధ్ర ఒడిశా సరిహద్దు కమిటీ కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులకు ఆయన పేరుతో పత్రిక అందింది. ఆ ప్రకటన సారాంశం క్రింద విధంగా ఉంది. 18వ లోక్ సభకు జరిగిన ఎన్నికలలో బీజేపీ 'వికసిత్ భారత్, 'నయా భారత్' నినాదంతో అధికారంలోకి వచ్చి తన హిందుత్వ ఎజెండాను అమలు చేయాలనుకున్నది. కానీ దేశ ప్రజలు దానిని తిరస్కరించడంతో సొంత బలంతో కేంద్రంలో అధికారం స్థాపించలేకపోయింది. అవకాశవాద రాజకీయ పార్టీలతో కలెగూర గంపగా ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరింది. పదవుల పంపకమైతే పూర్తయింది. కానీ ఎన్డీఏ చేపట్టబోయే రాజకీయ, ఆర్థిక విధానాలేమిటో, దాని కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ ఏమిటో ఇప్పటివరకైతే ప్రకటించలేదు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమిలోని పార్టీలకు ఉమ్మడి ఎజెండా కూడా లేదు. ఏ పార్టీకి ఆ పార్టీగా తమ మానిఫెస్టోలను ప్రకటించి ఉన్నాయి. టీడీపీ చంద్రబాబు ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వంలో ఏ ప్రాతిపదికన చేరాడో ప్రకటించలేదు. వైఎస్ఆర్సీపీ జగన్ ప్రభుత్వం గత 5 ఏళ్ళుగా అనుసరించిన ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద, బడా భూస్వామ్య అనుకూల విధానాలనూ, నిరంకుశ పాలనను ప్రజలు వ్యతిరేకించి గద్దె దించారు. ప్రత్యామ్నాయం లేక ప్రజలు టీడీపీకి ఓట్లు వేసారు. దానితో చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీఏ మెజారిటీని సాధించి అధికార పగ్గాలు చేపట్టబోతున్నది. ఇందులో బీజేపీ కూడా ఉండబోతున్నది. ఎన్నికలకు ముందు టీడీపీ-జనసేన, బీజేపీలు విడి విడిగా తమ ఎన్నికల మానిఫెస్టోలను ప్రకటించాయి. మరి ప్రస్తుతం ఏర్పడబోయే ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం ఏ మానిఫెస్టోను అమలు పరుస్తుంది? రాష్ట్రం ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ప్రజలు డిమాండ్ చేయాలి.

# ఎన్డీయే కూటమి ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రసారం
### - అన్ని మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఏర్పాట్లు
### - చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ

విజయనగరం బ్యూరో, జూన్ 11, మేజర్‌న్యూస్: సాధారణ, అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బుధవారం ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసారిపల్లిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా ప్రజలంతా వీక్షించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 10.00 గంటలు నుంచి ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం జిల్లా కేంద్రంలో, అన్ని మండలాల్లో ప్రారంభమవుతుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో భారీ ఎల్ఈడి స్క్రీన్లు, టివి సెట్లను ఏర్పాటు చేశారు. విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంతోపాటు, ఆనందగజపతి ఆడిటోరియంలో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

**చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాలు**

ఒక పండుగ వాతా వరణంలో ముఖ్యమం త్రిగా శ్రీ నారా చంద్రబాబునాయుడు, ఇతర మం త్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భాన్ని పురస్క రించుకొని, ప్రభు త్వ సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని చారిత్రక కట్టడాలను, ప్రభుత్వ భవనాలను రంగు రంగుల విద్యుత్ దీపాల తో అలంకరిం చారు. శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం, గురజాడ స్వగృహం, విజయనగరం కోట, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, మహారాజా సంస్కృత కళాశాల, కలెక్టరేట్ కాంప్లెక్స్, జిల్లా పరిషత్ కార్యాలయం, మర్రిచెన్నారెడ్డి భవనం (డిఆర్‌డిఏ), ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ కాంప్లెక్స్, మున్సిపల్ కార్యాలయం, ఆర్ అండ్‌బి కార్యాలయం, పంచాయితీరాజ్ భవనం, దేవాదాయశాఖ కార్యాలయం తదితర భవనాలను అలంకరించారు. సోమవారం రాత్రి నుంచే ఈ కట్టడాలు విద్యుత్ వెలుగులతో కాంతులీనుతున్నాయి.




# పారిశుధ్య విధానంలో మెరుగైన మార్పు తీసుకురావాలి
### నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు



**విజయనగరం టౌన్, జూన్ 11, మేజర్‌న్యూస్:** నగరంలో పారిశుధ్య విధానంలో మెరుగైన మార్పు తీసుకురావాలని, లేదంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు ఈరోజు నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంశాలవారీగా పారిశుధ్య విధానంలో చేపడుతున్న చర్యలు గూర్చి సమీక్షించారు. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటినుండి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇందుకు అవసరమైన పనిముట్లు, యంత్రాలు తదితర అంశాలపై సమగ్ర నివేదికలు రూపొందించి అందించాలన్నారు. సచివాలయాల వారీగా ఆయా పరిధిలో నెలకొన్న పారిశుధ్య లోపాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కాలువల్లో పూడికతీతలు నిలిచి ఉన్న పరిస్థితులపై ప్రస్తావించారు. ఏది ఏమైనా వర్షాలు కురిసే సమయాని కన్నా ముందుగానే కాలువల్లో పూడుకితీత పనులు పూర్తి కావాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించాలని చెప్పారు. దోమల నియంత్రణకు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు. లార్వాదశలోనే దోమలను నియంత్రించాలని, అందుకు అవసరమైన ఏంటి లార్వా ఆపరేషన్ ను పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. చెరువులు, కుంటలలో ఆయిల్ బాల్స్ పిచికారిని ముమ్మరం చేయాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఉన్న సెప్టిక్ గొట్టాలకు నెట్లు అమర్చే విధంగా ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. మొక్కలను విరివిగా నాటేందుకు అవసరమైన స్థలాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న దృష్ట్యా విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు పరిస్థితులపై తనిఖీలు చేయాలన్నారు. నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం అయ్యేంతవరకు అవిశ్రాంత కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఆకస్మిక తనిఖీలను చేపడతామని చెప్పారు. నగరంలో ఉన్న భోజనశాలల చుట్టూ పరిశుభ్ర వాతావరణ ఉండేవిధంగా పరిశీలించాలన్నారు. ఆహార పదార్థాలు తాజాగా, పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అనేది గమనించా లన్నారు. వీధి కుక్కలకు శతశాతం స్టెరిలైజేషన్ అయ్యేవిధంగా చూడాలన్నారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేం దుకు తాము చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయి నుండి పారిశుధ్య విధానాల్లో సమూల మార్పులు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రశ్నార్ధకంగా ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి
### - కొత్త మద్యం పాలసీ వస్తే 18వేల మంది యువత భవితవ్యంపై నీలినీడలు
### - సేల్స్ మేన్, సూపర్వైజర్ పోస్టులు హుష్ కాకేనా!
### - ఆందోళనలో 18వేల కుటుంబాలు

**కే కోటపాడు, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఒక పక్క నిరుద్యోగం, మరో పక్క ఉన్న ఊరిలో ఉద్యోగం. చదివిన చదువులకు ఉద్యోగాలు వస్తాయో లేదో తెలీదు. వచ్చిన అవకాశాన్ని చేజార్చుకునే కంటే ఇంటి భాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వడమే మేలన్న తలంపుతో డిగ్రీలు, పీజీలు, బిఈడీలను పక్కన బెట్టి చిరుద్యోగమని చూడకుండా ప్రభుత్వ మద్యం షాపుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా చేరిపోయారు. చాలీ చాలని జీతాలు ఇస్తున్నా ఎలాగోలా సర్దుకు పోయారు. అయితే ప్రభుత్వం పాలకులు మారుతున్న నేపథ్యంలో వీరి ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న 18వేల మంది యువత దీన గాథ ఇది. గత ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వ మద్యం షాపులను ప్రవేశపెట్టింది.రాష్ట్రంలో 3వేల 600 మద్యం షాపుల్లో సుమారు 18వేల మంది యువకులకు వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించింది. సేల్స్ మాన్ కు ఇంటర్ అర్హత కాగా సూపర్ వైజర్ పోస్టుకు డిగ్రీ అర్హత పెట్టారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడం చదువు పూర్తయ్యి ఖాళీగా ఉండడంతో చాలా మంది యువకులు మద్యం షాపుల్లో ఉద్యోగాలైనప్పటికి పని చేసేందుకు ముందుకు వచ్చారు. కోవిడ్ లో సైతం ధైర్యంగా విధులు నిర్వహించారు. ఇలా గత ప్రభుత్వానికి ఐదేళ్ళ పాటు ఆదాయాన్ని సమకూర్చారు.ప్రస్తుతం వైసీపీ ఓటమీపాలు కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానుంది. మద్యం పాలసీని మారుస్తారన్న ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో మద్యం షాపుల్లో పని చేస్తున్న 18వేల మంది యువత భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. పనిచేసే వారు 18వేల మంది మాత్రమే అయినప్పటికీ వీరి కుటుంబాలు మొత్తం వీధిన పడడం ఖాయంగా కనిపిస్తోంది. ఇపుడు నూతన ప్రభుత్వం మద్యం పాలసీ మార్చి ప్రవేటి కరణ చేస్తారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అలా జరిగితే 18వేల మంది ఉద్యోగులు వీధిన పడడం ఖాయమని అంటున్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న వీరిని తొలగిస్తే వీధిన పడడం ఖాయమని తెలియడంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు.




## అంటువ్యాధులు ప్రబలకుండా
# జాగ్రత్తలు తీసుకోవాలి



**దేవరాపల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** మలేరియా, డెంగ్యూ ఇతర అంటూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ వైద్యాధికారిణి పూజ్య మేఘన సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య వైద్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా అరికట్టడం, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఉపయోగం, గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన జాగ్రత్తలు, ఈ ఆశా డేటా అప్డేట్, ఆరోగ్యం పై అవగాహన, పరిసరాలు పరిశుభ్రత, యాంటీ లార్వా ఆపరేషన్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రసాద్, పీహెచ్ఎన్ సునీత, హెచ్ ఎస్ పుష్పరాజ్, హెచ్ సి లక్ష్మి, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్దిగ్రామంలో ఘనంగా
# దుర్గాదేవి అమ్మవారి ఉత్సవం



**పద్మనాభం, జూన్ 11, మేజర్‌న్యూస్:** మండలంలో మద్దిగ్రామంలో లక్ష్మినాయుడుగారి కళ్లాల వద్ద ఉన్న శ్రీరామకోటి ఆశ్రమంలో కొలువు దీరిన దుర్గాదేవి అమ్మవారి ఉత్సవంను మంగళవారం ఆలయ ధర్మకర్త కనకల బంగారు నాయుడు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామం నుండి భక్తులు మాదిగ డప్పుల వాయిద్యాలతో బయలుదేరి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మవారి ఆలయానికి చేరుకొన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త బంగారునాయుడు దంపతులతో ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు చేయించారు. తరువాత అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా నాగవంశం కార్పోరేషన్ మాజీ చైర్పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బి.అప్పలనాయుడు, మండల టీడీపీ యూత్ అధ్యక్షుడు కాళ్ల సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఆలయ ధర్మకర్త బంగారునాయుడు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

# రైతులకు వరి విత్తనాల పంపిణీ



**దేవరాపల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద మంగళవారం రైతులకు వరి విత్తనాలు సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి చేతుల మీదుగా రైతులకు ప్రభుత్వ రాయితీపై విత్తనాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు కావలసిన రకం వరి విత్తనాలు ఆర్బికే కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొని విత్తనాలు పొందాలని అన్నారు. సిద్ధంగా ఉన్న విత్తనాలు ఆర్ జె ఎల్, 66 క్వింటాలు, ఎం టి యు 1121, 36 కింటాలు, సాంబ మసూరి 30 కింటాలు, అమర్ 16 కింటాలు ఉన్నాయన్నారు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆర్ బి కే సిబ్బంది కాటిపాము సత్య రావు, భాగ్యశ్రీ, వార్డు మెంబర్లు కొల్లి ఈశ్వరరావు, బంధం అప్పలరాజు, గుల్లిపల్లి మురళి, పరవాడ రవి రైతులు పాల్గొన్నారు.

## 17న రామ నారాయణంలో
# సీతారాముల కళ్యాణ మహోత్సవం

**విజయనగరం కలెక్టరేట్, జూన్ 11, మేజర్‌న్యూస్:** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామ నారాయణంలో ఈనెల 17వ తేదీన శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవ ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ 17వ తేదీ ఉదయం ఏడు గంటలకు సీతారాములకు స్నపనము ,10 గంటలకు రామ తారక మంత్ర హోమము ,12 గంటలకు పూర్ణాహుతి జరుగుతుందని పేర్కొన్నారు . సాయంత్రం ఐదు గంటలకు వైఖానస ఆగమానుసారముగా ప్రముఖ ఆగమ పండితులు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ,వేద పండితులు వేద విద్యార్థుల వేద పట్టణం నడుమ ,విశాఖపట్నం కు చెందిన చైతన్య సోదరులచే సాంప్రదాయ సంగీత సాహిత్య సమ్మేళనంతో ,శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రధాన అర్చకులు గోపి నంబాళ శేషాచార్యులు వ్యాఖ్యానంతో అంగరంగ వైభవంగా సాయంత్రం ఐదు గంటలకు సీతారామ కళ్యాణం నిర్వహించబడుతుందని భక్తులందరూ పాల్గొనవలసిందిగా కోరారు. సీతారాముల కళ్యాణ ఉత్సవాన్ని అందరూ తిలకించేందుకు గాను ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల ఎన్ సి ఎస్ మల్టీప్లెక్స్ వద్ద నుండి, ఎన్ సి ఎస్ థియేటర్ వద్ద నుండి ఉచితంగా ప్రయాణం చేసేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ,ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం నీరజ వల్లి, డైరెక్టర్ గౌరీ నిత్య ,దేవాలయం అర్చకులు చాణక్య ,శ్రీనివాసరాజు, ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు

# ప్రతీ మంగళవారం మెగా వైద్య శిబిరం
### సాయి ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ వైద్యులచే ఉచితసేవలు



**విజయనగరం కలెక్టరేట్, జూన్ 11, మేజర్‌న్యూస్:** ప్రతీ మంగళవారం పట్టణంలోని సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి( డాక్టర్ శ్రీరామమూర్తి) ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ అక్కెన సుధామాధురిచే మెగా వైద్యశిబిరం నిర్వహించి ఉచిత వైద్యసేవలు అందజేయనున్నట్లు ఆసుపత్రి ఎండీ డాక్టర్ అక్కెన శ్రీరామమూర్తి తెలిపారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయి ఆసుపత్రిలో ఎప్పటినుంచో పేదవారికి వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలకు వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాలు కూడా ముందుకు వచ్చి సహకరించటం చాలా సంతోషకరమన్నారు. ఆసుపత్రిలో జాయిన్ అయిన వారికి అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తామన్నారు. ఈ ఆసుపత్రిలో ఎముక్కులు, కీళ్ల కుసంబంధించిన స్పెషాలిటీతో పాటు, జనరల్ సర్జరీ, ఈఎన్ టీ, జనరల్ మెడిసిన్, న్యూరో సర్జరీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలతో పాటు క్రిటికల్ కేర్ యూనిట్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెత్సా సత్యనారాయణ మూర్తి, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నా బుచ్చి జనార్ధనరావు, కట్టమూరి రత్నారావు, మండవిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారంకు
# తరలివెళ్ళిన టిడిపి శ్రేణులు



**గరుగుబిల్లి, జూన్ 11, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో మండలం నుండి అధిక సంఖ్యలో మంగళవారం టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు. ఈమేరకు మండల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కండేన బలరాం నాయుడు, అక్కేన నారాయణరావు, నగిరెడ్డి పోలినాయుడు, తంగుడు ఆనందరావు, జి రామారావు, బోనెల వెంకటి, తదితరులు నారా చంద్ర బాబునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవంకు బస్సులో తరలి వెళ్లారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి ఎర్రన్నగుడి జంక్షన్ వద్దకు చేరుకున్న నాయకులు బస్సులో ప్రమాణ స్వీకార మహోత్సవంకు బయలుదేరి వెళ్లారు. మండలం నుండి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం మహోత్సవం కార్యక్రమంకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, తరలివెళ్లడం జరిగిందని టిడిపి నాయకులు కండేన బలరాం నాయుడు తెలిపారు.

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజీనామా
### సిరిదెల్లి శ్రీను వాస్



**అచ్చుతాపురం, జూన్ 11, మేజర్‌న్యూస్:** యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి సిరిదెల్ల శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలు కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. తనకి అవకాశం కల్పించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి కి. శాసనసభ్యులు శ్రీ కన్నబాబు రాజుగారికి. జిల్లా మంత్రివర్యులు శ్రీ గుడివాడ అమర్నాథ్ కి. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ బొడ్డేడ ప్రసాద్ కి ధన్యవాదాలు తెలియజేశారు.. జరిగిన ఎన్నికల్లో విజయం సాధించినటువంటి ఎన్డీఏ కూటమికి.. నూతనంగా ఎన్నికైనటువంటి శాసనసభ్యులు శ్రీ సుందరపు విజయ్ కుమార్కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలుగుదేశం అధినేతను కలసిన ఎమ్మెల్యే మామిడి



**కొత్తూరు, జూన్ 11, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడ్ని విజయవాడ ఉండవెల్లి తన నివాసంలో కొత్తగా ఎన్నికైన పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేసారు. వైసీపీ హయాంలో అభివృద్ధి కి నిరాధారణ గురైన పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం లో నడిపించాలని విజ్ఞప్తి చేశారు..

## హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి నిరోషా రాజీనామా



**కొత్తూరు, జూన్ 11, మేజర్‌న్యూస్:** పాతపట్నం నియోజకవర్గం పరిది లో గల హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సారిపల్లి నిరోషా సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి కాళేశ్వరరావు కు అందజేశారు. పాతపట్నం నియోజక వర్గం వైసీపీ ఓటమికి నైతిక భాధ్యత వహిస్తూ రాజీ నామా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాజీనామా పత్రం ఆమోదం కోసం ఉన్నతాధికారులకు కుపంపించినట్లు కమిటి కార్యదర్శి వెల్లడించారు.

## నేడు ఎల్సిడి స్క్రీన్ పై సీఎం ప్రమాణ స్వీకారోత్సవం ఏర్పాటు

**పూసపాటిరేగ, జూన్ 11, మేజర్‌న్యూస్:** : మండల కేంద్రమైన పూసపాటిరేగ లోని స్థానిక కళ్యాణ మండపంలో ఎల్సిడి స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రాధిక తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో డ్వాక్రా మహిళలు ఈ కార్యక్రమం ద్వారా తిలకించే విధంగా ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ఎంపీడీవో ఓ ప్రకటనలో తెలిపారు.

## రామోజీ రావుకి జర్నలిస్టులు శ్రద్ధాంజలి

**శృంగవరపుకోట, జూన్ 11, మేజర్‌న్యూస్:** ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకి పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ శృంగవరపుకోట జర్నలిస్టులు మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ ఆవరణములో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు గోవింద్ ప్రకాష్ శర్మ, హనుమాన్ శెట్టి నానాజీ మాట్లాడుతూ రామోజీరావు మరణం తెలుగు పత్రికా ప్రపంచానికి తీరని లోటని అన్నారు. 1936లో జన్మించిన ఆయన యాడ్ ఏజెన్సీలో ఉద్యోగిగా పనిచేశారని. ఆ తరువాత ఈనాడు పత్రికను నెలకొల్పి పత్రికను నడపడంలో అనేక నిర్ణయాలు చేశారన్నారు. తెలుగు భాషను ఉద్ధరించేందుకు తెలుగు వెలుగు అని ప్రత్యేక సంచికను తీసుకుని వచ్చి పిల్లల్లో కూడా తెలుగు భాష పట్ల మమకారాన్ని పెంచేందుకు తోడ్పడ్డారని. కేవలం పత్రికకే పరిమితం కాకుండా వివిధ వ్యాపారాలలో అడుగుపెట్టి తలదన్నే రీతిలో వినూత్నంగా ఆలోచన చేయడమే కాకుండా అటువంటి ఆలోచన చేసిన వారికి ప్రోత్సాహం అందించే వారిని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ముగ్గు ధర్మారావు, జాగరం నాయుడు, గనివాడ బాపు నాయుడు, రాజు, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## తన నామినేటెడ్ పదవికి రాజీనామా చేసిన దూదేకుల ముస్లిమ్ కార్పొరేసన్ స్టేట్ డైరెక్టర్ మదీనా



**లక్కవరపుకోట, జూన్ 11, మేజర్‌న్యూస్:** లక్కవరపుకోట మండలం కి చెందిన దూదేకుల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గా వున్నా షేక్ మదీనా వైసీపీ ప్రభుత్వము ఒడి పోవడం తో తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు రాజీనామా పత్రాన్ని మెయిల్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంగళ వారం పంపినట్టు తెలిపారు తనకు నామినేటెడ్ పదవి దక్కేందుకు సహకరించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కి ఇతర పార్టీ పెద్దలకు తనకు గౌరవం ఇచ్చి అన్ని విధాలా సహకరించిన పార్టీ పెద్దలకు ముస్లిం మైనారిటీ సోదరులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

## ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారనికి తేజ్ కుమార్ టీమ్




**సారవకోట, జూన్ 11, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం సారవకోట మండలం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం మహోత్సవానికి నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్తున్న సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్ సారవకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సాదు క్రిష్ణరావు ,పొద్దిన రత్నాల నాయుడు ,సురవరపు తిరుపతిరావు ,చీడి వెంకటరమణ చిన్నాల సింహాచలం ,కొర్ను హేమంత్ గారు,బోర ధనంజయ్ ,నిక్కు జనార్దన్ ,సారవకోట రామారావు ,చల్ల ఆనంద దువ్వారి జయరాం ,నక్క తవిటినాయుడు ,రావడ సురేష్ ,డొక్క వెంకటరమణ ,మామిడి ఆనంద పిళ్ళా నందకిషోర్ ముద్దాడ లక్ష్మణ ,గొంటి శంకర్ ,సూరపు రమేష్ ,కుంచాల ఈశ్వర్ రావు సాధు అప్పలనాయుడు ,చిన్నాల క్రిష్ణ ,రెడ్డి రాములు ,కింజరాపు రామారావు , పొన్నగంటి మురళి ,కుంచి రాము , మెండ కాంతారావు ,బైరి బుచ్చిబాబు ,కుజ్జి అప్పలనాయుడు వైకుంత రావు ప్రమాణ స్వీకరానికి బయలుదేరారు.

## జులై 1న ఒక్కొక్కరికి రూ.7 వేలు ఫించన్

**పలాస/మందస, జూన్ 11, మేజర్‌న్యూస్:** 2024లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. వీరి విజయానికి ఎన్నికలకు ముందు కూటమి ప్రకటించిన ఉమ్మడి మేనేఫెస్టో కూడా ఒక కారణం. అందులో ఫించన్ల పెంపు అంశం సామాన్యుడిని అమితంగా ఆకర్షించిందని ప్రత్యేకగా చెప్పనవసరం లేదు. వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచుతామని హామీనిచ్చాయి. ఏప్రిల్ నెల నుంచే పెరిగిన సామాజిక భద్రత పింఛన్లను అందిస్తామని హామీ ఇచ్చింది. పెరిగిన పింఛన్ జులై 1వ తేదీన అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 65.30 లక్షల మంది పింఛను లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు పింఛను నగదు చెల్లింపులకుగాను నెలకు రూ.1,939 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తూ వచ్చింది. ఏప్రిల్ నుంచే రూ.4 వేల పింఛను పెంపు అమలు చేస్తే ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున జులై 1న పింఛను పంపిణీ చేయవల్సి ఉంటుంది. ఆగస్టు నుంచి అయితే నెలకు రూ.2,800 కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టిన అధికారులు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. వీరందరి వివరాలను వైద్యశాఖ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కూడా 50 ఏళ్లకే పింఛను అమలు చేస్తామని ఉమ్మడి మ్యానిఫెస్టోలో ప్రకటించారు. ఈ సామాజిక వర్గాల్లో 50 ఏళ్లు పైబడిన వారు ఎంత మంది ఉన్నారు, అనే వివరాలను కూడా సమీకరిస్తున్నారు. రేపు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మంత్రి మండలి కూర్పు జరుగుతుంది. ఆ తర్వాత రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలన కొనసాగుతుంది. అనంతరం జులై 1న పింఛను పంపిణీ సాధ్యాసాధ్యాలపై సర్కార్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

### శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో వెల్లడి




**పూసపాటిరేగ, జూన్ 11, మేజర్‌న్యూస్:** పిల్లల పెంపకం విషయంలో చిన్నతనం నుంచే తగు జాగ్రత్తలు తీసుకుంటే వారు పెరిగే కొలది ఆశించిన ఫలితాలను సాధించవచ్చునని ఎంపీడీవో రాధిక అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పిల్లల పెంపకంలో సంరక్షకుల పాత్ర అనే శిక్షణ కార్యక్రమం పై మంగళవారం జరిగింది. స్థానిక పిహెచ్సి వైద్యాధికారి రాజేష్ వర్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధిక ముఖ్య అతిథిగా హాజరై పిల్లల సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు చిన్నతనంలోనే పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించినట్లయితే భవిష్యత్తులో ఆశించిన లక్ష్యాలను సాధించవచ్చునన్నారు. పుట్టే బిడ్డలను వారి తల్లిదండ్రులు గాని సంరక్షకులు గాని నిర్లక్ష్యం చేస్తే వారి భవిష్యత్తుయే అంధకారం అవుతుందన్నారు. పుట్టే చిన్నారుల కోసం అంగన్వాడీలు, ప్రభుత్వ ఆసుపత్రులు సమన్వయంగా పని చేసి పోషక విలువలతో కూడిన ఆహారము అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న విషయాన్ని వివరించారు అనంతరం పీహెచ్సీ వైద్య అధికారిని ప్రమీల దేవి చిన్నారుల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పీహెచ్ సిబ్బంది మహేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ధ్యేయం

### ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు



**రావికమతం, జూన్ 11, మేజర్‌న్యూస్:** చోడవరం నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తన ధ్యేయం మని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన నేటి దినపత్రిక సూర్య తో మాట్లాడుతూ చోడవరం నియోజవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమన్నదీ తెలిసిన విషయమేనన్నారు. ఈ కారణంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తనకు మంత్రి పదవి కన్నా ఉత్తరాంధ్ర సుజలా స్రవంతి నిర్మాణం, చోడవరంలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు ముఖ్యమని ఇదే విషయాన్ని అధిష్టానానికి కూడా తెలిపానన్నారు. గత కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోని పంట కాలువలు, చెరువులు గ్రోయిన్లు మధుములు చెక్ డామ్ లు అభివృద్ధి చేయడం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తానన్నారు. కొమల్ల పూడి కృషి విజ్ఞాన కేంద్రన్ని బలోపేతం చేసి ఆధునిక వ్యవసాయము రైతులు చెంతకు తీసుకెళ్తఅని చెప్పారు. శంకుస్థాపనకే పరిమితమైన గంధవరం విత్తన పరిశోధన అభివృద్ధి ఉత్పత్తి కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకుంటుమన్నారు . దీనివల్ల అధిక దిగుబడినిచ్చే విత్తనాలు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఉద్యానవన పంటల శాఖ ద్వారా ప్రతి ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంపకానికి చైతన్యవంతులు చేస్తామని వివరించారు. దీనివలన ఇంటి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. 17 నుంచి 18 శాతం రికవరీ వస్తున్న క్యూబా దేశపు చెరుకు వంగడాన్ని ఈ ప్రాంతానికి పరిచయం చేయడానికి కృషి చేస్తానన్నారు. చోడవరం షుగర్ ఫ్యాక్టరీ కి ఆధునిక మిషనరీ ఏర్పాటుచేసి ఇథనాల్ ఉత్పత్తి పెంచడం దీని ద్వారా బయో డీజిల్ తయారు చేయడంద్వారా ఫ్యాక్టరీ కి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. మండలానికి రెండు చిన్న పారిశ్రామిక వాడలు ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నామని ఎమ్మెల్యే రాజు తెలిపారు. వీటితోపాటు నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో రోడ్లను సిసి రోడ్లుగా అభివృద్ధి పరచడం, ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడం తన బాధ్యత అన్నారు. గతంలో నిలిచిపోయిన సబ్బవరం నుంచి మల్కాజ్ గిరి హైవే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తానని వివరించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న అన్ని రోడ్ల ను తారు రోడ్లుగా అభివృద్ధి పరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇది తన విజన్ గా చెప్పుకొచ్చారు. తనమీద నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు

# మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

### నూతన ఎంఆర్పిఎస్ మండల కమిటీ నాయకులు



**రామభద్రపురం, జూన్ 11, మేజర్‌న్యూస్:** మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన రామభద్రపురం ఎంఆర్పిఎస్ మండల కమిటీ నాయకులు హామీ ఇచ్చారు. ఆరికతోట బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నూతన మండల కమిటీ ఏకగ్రీవముగా జిల్లా ఎంఆర్పిఎస్ అధ్యక్షులు బోగి శ్రీను మాదిగ,మరియు జిల్లా టీం అధ్యక్షతన ఎంపిక కాబడ్డారు. రామభద్రపురం మండల అధ్యక్షుడిగా యజ్జల రవికుమార్ మాదిగ, ఉపాధ్యక్షులుగా సవరాల అశోక్ మాదిగ,కార్యదర్శిగా యజ్జల ప్రసన్న మాదిగ,అనుబంధ కార్యదర్శిగా రేజేటి చంటి కోశాధికారిగా దేవుపల్లి జీవరత్నం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షులు రవికుమార్ మాదిగ మాట్లాడుతూ తమ కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేసిన ఎంఆర్పీఎస్,ఎంఈఎఫ్ రాష్ట్ర,జిల్లా నేతలకు ధన్యవాదాలు తెలియజేశారు. నేటి నుంచి అన్ని రంగాల్లో ఉన్న మాదిగ కులస్తులకు తన వంతు సహాయ కార్యక్రమాలు చేస్తానని జాతి అభ్యున్నతికి కృషి చేస్తానని సభాముఖంగా తెలిపారు. మండల పరిధిలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే మా కమిటీ దృష్టికి తీసుకు వస్తే తక్షణమే ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమితి పేరు చెప్పి దందాలు,దోపిడీలు చేస్తే సహించేది లేదని ఒకే తాటిపై కులస్తులంతా జాతి అభివృద్ధికి నడుం కట్టాలని పిలుపు నిచ్చారు. జిల్లా అధ్యక్షులు శ్రీను మాట్లాడుతూ కృష్ణ మాదిగ స్థాపించిన ఎంఆర్పీఎస్ ను జాతి కోసం ముందుకు తీసుకు వెళ్లాలని ఎక్కడైనా కులస్తులకు ఇబ్బందులు ఎదురైతే సమష్టిగా పోరాటాలు చేసి న్యాయం పక్షాన నిలవాలని కోరారు. కృష్ణమాదిగ మద్దతు పలికిన రాజకీయ పార్టీలు కేంద్ర,రాష్ట్రంలో మంచి మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు నిస్వార్థంగా పనిచేయాలని, జాతి పేరు,మందకృష్ణన్న పేరు చెడ కొట్టకుండా పని చేయాల న్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర బాబు మాదిగ,కార్యదర్శి యండవ రవి,అధికార ప్రతినిధి పొందూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం




**మాకవరపాలెం, జూన్ 11, మేజర్‌న్యూస్:** మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఎండపల్లి దుర్గ, ఎండపల్లి నూకరత్నం ఇటీవల సముద్ర స్థానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. అయితే ఈ మృతుల కుటుంబానికి అండగా నిలవాలని గ్రామానికి చెందిన గొర్లి శంకర్, తోటి యువకులందరూ కలిసి తలో చేయి వేసి సుమారు 10వేల రూపాయలను ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ ఆధ్వర్యంలో కామిరెడ్డి ఎర్రినాయుడు జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఒక నెలకి సరిపడా నిత్యవసర సరుకులు మృతుల కుటుబాలకు అందజేశారు. మఅతుల కుటుంబానికి అందించడం జరిగింది.

## పట్టాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు



**లక్కవరపుకోట, జూన్ 11, మేజర్‌న్యూస్:** లక్కవరపుకోట మండల కేంద్రంలోని సంగం వీధిలో గల శ్రీ పట్టాలమ్మా అమ్మవారి దేవాలయం లో మంగళ వారం అమ్మవారికి వేద పండితులు శ్రీ అక్కా జోస్యుల శ్రీహరి శర్మ అద్వర్యం లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా కుంకు మ పూజ చేసి మంగళ హారతి అమ్మవారికి నివేదించారు ఈ సందర్భంగా శ్రీ హరి శర్మ మాట్లాడుతూ మంగళ వారము అమ్మవారికి ఇష్టమైన వారమని అందుకే ప్రతీ వారం ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు మహిళలు తమ పసుపు కుంకుమలు కాపాడటం తో పాటు తమ కుటుంబాన్ని రక్షించి కాపాడమని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారని పట్టాలమ్మను నమ్ముకుని వేడు కున్నవారిని అమ్మ చల్లగా చేస్తుందనే నమ్మకం భక్తుల్లో ఉందన్నారు అందుకే క్రమము తప్పకుండ ప్రతి మంగళవారం పూజల్లో మహిళలు అధిక సంఖ్య లో పాల్గొంటున్నారని తెలిపారు.

## జడ్పిటిసి రమణమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రముఖులు



**రావికమతం, జూన్ 11, మేజర్‌న్యూస్:** జడ్పిటిసి తలారి రమణమ్మ అంతిమయాత్రలో జిల్లా నలుమూలల నుంచి రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, రావికమతం ఎంపీపీ పైల రాజు బుచ్చయ్యపేట జడ్పిటిసి దొండా రాంబాబు, మండల కో ఆప్షన్ నెంబర్ గాలి రమణ బాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణమ్మ సేవలను గుర్తుచేసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర మాట్లాడుతూ తన పదవి కాలంలో నిరంతరం రావికమతం మండలం అభివృద్ధికి, మహిళలు సంక్షేమానికి ప్రతిపాదనలు తన ముందు ఉంచేవారన్నారు. తనపై నమ్మకంతో జడ్పిటిసిగా గెలిపించిన రావికమతం మండల ప్రజలకు తగని రీతిలో సేవ చేయాలని నిరంతరం తపించే వారని గుర్తు చేసుకుని కళ్లనీళ్ళ పర్యంతమయ్యారు.

## మోదకొండమ్మకు జలాభిషేకం



**మాడుగుల, జూన్ 11, మేజర్‌న్యూస్:** మాడుగుల శ్రీ మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం ఉదయం వర్షాలు కురవాలంటూ అమ్మవారి శతకంపట్టు వద్ద పాదాలకు మాడుగులకు చెందిన మాల ధరించిన మాతలు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి పాదాలకు పసుపు నీళ్ల జలాభిషేకం నిర్వహించి అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో మాడుగుల వీధి నుండి అనేకమంది మహిళలు పసుపు నీళ్ల బిందెలతో తరలివచ్చి అమ్మవారికి పసుపు నీళ్ల అభిషేకం నిర్వహించారు. దీంతో సతకంపట్టు వద్ద పండుగ వాతావరణం ఏర్పడింది.

## వృద్ధ మహిళలకు చీరల పంపిణీ



**బాడంగి, జూన్ 11, మేజర్‌న్యూస్:** మండలంలోని లక్ష్మీపురం పంచాయితీ మధుర గ్రామమైన ఎరుకుల పాకలు గ్రామం లో బొబ్బిలి శాసనసభ్యులు గా గెలుపొందిన బేబీ నాయన మరియు మాజీ శాసనసభ్యులు తెంటు లక్ష్మునాయుడు ఆదేశాల మేరకు పిన్నవలస గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కొల్లి రామ నాయుడు మంగళవారం నిరుపేద, వృద్ధ మహిళలకు టిడిపి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ పాలవలస గౌరు మరియు లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ చేశారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

**లక్కవరపుకో, జూన్ 11, మేజర్‌న్యూస్:** నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా బుధవారం ప్రమాణ స్వీకారము చేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజల కోసం ప్రదర్శించ బోతున్నాము అని ఎంపీడీఓ రూపేష్ తెలిపారు ఈ కార్యక్రమం 12 జూన్ 2024న ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది అని 11:15 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుంది. అని ప్రత్యక్ష ప్రసారం ప్రజలు చూసేందుకు గాను మండల కేంద్రం లోని భద్ర మహంకాళమ్మ ఆలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్, లో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు అయన తెలిపారు అలాగే ఈ సందర్భంగా అక్కడే ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయబడుతుంది అని . భద్రత కోసం స్థానిక పోలీసుల సహకారం తీసుకోవడం జరిగింది అని ఎంపీడీఓ తెలిపారు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు .

## మలేరియా నియంత్రణకు సమిష్టి కృషి చేయాలి

### జిల్లా మలేరియా అధికారి జగన్ మోహన్ రావు



**సీతంపేట, జూన్ 11, మేజర్‌న్యూస్:** మలేరియా నియంత్రణకు సమిష్టి కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. దోనుబాయి పిహెచ్సి లో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని సమీక్ష జరిపారు. గ్రామాల్లో మలేరియా తదితర జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయి,ఏ విధమైన నియంత్రణ చర్యలు చేపడుతున్నారు మొదలైన అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. జ్వరాలను సకాలంలోగుర్తించి,క్షేత్ర స్థాయిలోనే నిర్ధారణ పరీక్షలు జరపాలని ఆదేశించారు. డ్రైడే కార్యక్రమాలు ప్రతీ రోజూ నిర్వహించి దోమల లార్వా నిర్మూలన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తించడంలో జాప్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయన్నారు. మారుమూల గ్రామీణ ప్రజలకు ఆ పరిధిలో ఉన్న వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలందించాలన్నారు. గర్భిణీ, శిశువుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించి మలేరియా నియంత్రణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఎస్.భాను ప్రతాప్, ఏఎంఓ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, కార్యాలయ సిబ్బంది ప్రసాదరావు, ఈఓ రాజారావు, సూపర్వైజర్స్, వైద్య సిబ్బంది,ఆశ కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లోపారిశుధ్యపనులు చేపట్టాలి

### ఎంపిడిఓ సాల్మన్ రాజు



**వంగం, జూన్ 11, మేజర్‌న్యూస్:** గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేటట్లుచూడాలని ఎంపిడిఓ సాల్మన్ రాజు పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. మంగళ వారం నాడు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పిఎస్ లను ఈమేరకు చర్యలు చేపట్టాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత గా ఉండాలంటే ప్రతీ గ్రామాల్లో కాల్వలలోపూడుకలను తొలగించటానికి అవసరమైన చర్యలుచేపట్టాలని కోరారు. గ్రామాల్లోకాల్వలు ఇంటి చుట్టు పక్కల ఉంటాయని వాటిని ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం అవసరమన్నారు. అపరిశుభ్రత వల్ల దోమలు వల్ల అంటువ్యాధుల విజృంభణకు కారణాలు పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంగా పేర్కొన్నారు. గ్రామాల్లో చెత్తను, రకరకాల వ్యర్థపదార్థాలను, సక్రమంగా నిర్మూలించక నిర్లక్ష్యం చేయడంవల్ల ప్రజలు అనేక రకాల వ్యాధులువల్ల రక,రకాల వ్యాధులు వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఎక్కువగా బహిరంగ మలవిసర్జన, బహిరంగ మురుగునీటిపారుదల వల్ల దోమల నిర్మూలన చేయకపోవడ వ్యర్థాల నిర్మూలన పాటించకపోవటం వల్ల ప్రజలకు ఇబ్బందు పడుతున్నారన్నారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి వచ్చే చెత్తను శాస్త్రీయంగా నిర్మూలించక పోవం వల్ల ఈగలు, దోమలు పుట్టి పెరిగి అంటు వ్యాధులను వ్యాపింపచేస్తున్నాయన్నారు. చెత్త నిర్మూలన కార్యక్రమానికి దీర్ఘకాల వ్యూహం ఈనాటి తక్షణ అవసరం అన్నారు. శుభకార్యాల సందర్భంలో వచ్చే చెత్తను సరైన విధంగా నిర్మూలించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మానవ మలమూత్రాల వల్ల, మురుగు వల్ల, రక్షణలేని తాగునీటి వల్ల కలరా, అతిసార, టైఫాయిడ్ కామెర్ల వంటి వ్యాధులు సంభవించే ప్రమాధముందన్నారు. వ్యర్థాలను సక్రమంగా పారవేద్దాం పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం అన్న విధంగా గ్రామాల్లో ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపిడిఓ సాల్మన్ రాజు వారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, 19 గ్రామ సచివాలయాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## తూము మట్టితో మూసివేయడంపై రైతులు ఆందోళన



**గొలుగొండ, జూన్ 11, మేజర్‌న్యూస్:** కేడిపేట బోయవానిచెరువు నుంచి సాగు పొలాలకు నీరు విడుదల అయ్యే తూము మట్టితో పూర్తిగా మూసివేశారు. దీనిపై చెరువు కింద సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ పంటకు సిద్ధం అవుతున్న రైతులకు ఈ తూము ఒక్కటే ఆధారమని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.